epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 25 | సంచిక: 162 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## ఇరాన్‌పై చమురు ఆంక్షలు



హోర్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ చమురు పరిశ్రమపై అమెరికా కఠినమైన ఆంక్షలను ప్రకటించింది.

- హోర్ముజ్ జలసంధి వివాదంతో ముదిరిన ఉద్రిక్తతలు
- ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చర్యలు
- రెండు డజన్లకు పైగా కంపెనీలు, వ్యక్తులపై ట్రెజరీ శాఖ ఆంక్షలు
- భారత్ వంటి దేశాల రిఫైనరీలపై పడనున్న ప్రభావం

.. వివరాలు 3లో



## జనగణనలో సరికొత్త అధ్యాయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన ఇంటింటి గణన గృహాల జాబితా సేకరణ గురువారం అత్యంత పకడ్బందీగా ప్రారంభమైంది. 'స్వీయ నమోదు' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియను చంద్రబాబు నాయుడు స్వయంగా ఆరంభించారు.

5

స్వీయ నమోదు ప్రక్రియను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశ చరిత్రలో తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో ఇంటింటి గణన



2

## తెలంగాణ ఏర్పాటు పాకిస్థాన్‌తో పోలిక

ఇండియా-పాకిస్థాన్‌లా విభజించారంటూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు

తెలుగు రాష్ట్రాల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టిందని ఆరోపణ

రేవంత్ రెడ్డి 'హైబ్రిడ్ ఫార్ములా'పై సెటైర్లు..

ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే.. కాంగ్రెస్ ఎంపీల ధ్వజం

## మరోమారు బీజేపీ తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## తెలంగాణను అవమానించడమే

- బేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలి
- మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్

3

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం



- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు
- దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

వివరాలు లోపలి పేజీల్లో

మహిళా రిజర్వేషన్ బిల్లును కేవలం రాజకీయ కోణంలో చూడవద్దని, ఇది దేశ భవిష్యత్తును మార్చే కీలక అడుగు అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ప్రధాని సుదీర్ఘంగా ప్రసంగించారు. గత మూడు దశాబ్దాలుగా భారతీయ సోదరీమణులు ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, వారి మేధస్సును, సామర్థ్యాన్ని గుర్తించి చట్టసభల్లో సరైన భాగస్వామ్యం కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వచ్చే క్రెడిట్ తనకో, తన ప్రభుత్వానికో అక్కర్లేదని.. ఏకగ్రీవంగా ఆమోదించే అన్ని రాజకీయ పార్టీలకే ఆ గౌరవం దక్కుతుందని మోదీ వ్యాఖ్యానించారు.

## లోక్‌సభ సీట్ల సంఖ్య 815కు పెంపు

- మహిళా రిజర్వేషన్లపై మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక ప్రకటన
- జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాతే మహిళా కోటా అమలు
- మహిళలకు 272 సీట్లు కేటాయింపు.. రాష్ట్రాల ప్రాతినిధ్యానికి డోకా లేదు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో మహిళా సాధికారతకు బాటలు



2

## 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా


4లో



## మా వైఖరి మారదు

సోనియా గాంధీ

.. వివరాలు 4లో



## ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

- మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ అక్కసు

.. వివరాలు 4లో

## నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

.. వివరాలు 3లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

స్పీకర్ సహా 9మంది వివరణ కోరిన హైకోర్టు

విచారణ మే 6కు వాయిదా

.. వివరాలు 2లో





## మంత్రాలయంలో ఘోర ప్రమాదం

- ఎనిమిది మంది భక్తుల మృతి
- శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా విషాదం
- 12 మందికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

.. వివరాలు 5లో

## తెలంగాణ గ్లోబల్ బ్రాండ్

- పెట్టుబడులకు ఇదే సరైన సమయం!
- ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో దేశంలోనే నంబర్ వన్..
- అమెరికా 'నేషనల్ వార్ కాలేజీ' బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

3



## ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏడీఈ

30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

3





# లోక్‌సభ సీట్ల సంఖ్య 815కు పెంపు

**మహిళా రిజర్వేషన్లపై మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక ప్రకటన**

**జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాతే మహిళా కోటా అమలు**

**మహిళలకు 272 సీట్లు కేటాయింపు.. రాష్ట్రాల ప్రాతినిధ్యానికి డోకా లేదు**


**131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో మహిళా సాధికారతకు బాటలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో డీలిమిటేషన్ మరియు మహిళా రిజర్వేషన్ బిల్లులపై జరిగిన చర్చలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచి, మొత్తం సీట్ల సంఖ్యను 815కు చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ విధానాన్ని, రాబోయే జనాభా లెక్కలు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయిన తర్వాతే పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు మంత్రి సభకు వివరించారు. లోక్‌సభ సామర్థ్యం 815 సీట్లకు పెరిగినప్పుడు, అందులో 33 శాతం కోటా ప్రకారం మహిళలకు 272 సీట్లు లభిస్తాయని మంత్రి లెక్కలతో సహా వివరించారు. ఈ ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, అన్ని రాష్ట్రాల సామర్థ్యం యథాతథంగా కొనసాగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. నియోజకవర్గాల పెంపు వల్ల పురుష సభ్యులకు కానీ, రాష్ట్రాలకు కానీ ఎటువంటి నష్టం వాటిల్లదని, ఇది కేవలం ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రక్రియ అని పేర్కొన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లు ద్వారా మహిళలకు రాజకీయాల్లో సమానత్వం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చర్చను ప్రారంభించిన మంత్రి తన ప్రసంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేసుకున్నారు. ఒక సమాజం ఎంత ప్రగతి సాధించిందో ఆ సమాజంలోని మహిళలు సాధించిన పురోగతి ఆధారంగానే అంచనా వేస్తామన్న అంబేద్కర్ వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల అంశాన్ని బలంగా సమర్థించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మాటలను కూడా ప్రస్తావించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే రోజులు వస్తాయని, అయితే దానికి కొంత సమయం పడుతుందని కలాం ఆనాడే చెప్పారని, ప్రధాని మోదీ నేతృత్వంలో ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చరిత్రాత్మక అడుగులు వేస్తోందని మంత్రి అభివర్ణించారు. ఈ బిల్లుల ద్వారా మహిళలకు చట్టసభల్లో నిర్ణయాత్మక పాత్ర లభిస్తుందని, ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని చెప్పారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల సామాజిక మార్పు వేగవంతం అవుతుందని, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు అందుతాయని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ తరాల మహిళలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనతో పార్లమెంటులో కొత్త ఉత్సాహం నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజనపై వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న సందేహాలను నివృత్తి చేస్తూనే, మహిళా రిజర్వేషన్ల అమలుపై స్పష్టమైన కాలపరిమితిని ప్రభుత్వం సూచించినట్లయింది. జనాభా లెక్కల ప్రక్రియ వేగవంతం కానుండటంతో, వచ్చే ఎన్నికల నాటికి కొత్త లోక్‌సభ నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చేసిన ఈ ప్రసంగం, దేశంలో మహిళా రాజకీయ చైతన్యానికి మరియు ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విస్తరణకు అద్దం పడుతోంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

**స్పీకర్ సహా 9మంది వివరణ కోరిన హైకోర్టు**

**విచారణ మే 6కు వాయిదా**



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేలతో పాటు, స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జాబితాలో ఉన్న ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది వారి ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా ఉంది.

# తెలంగాణ ఏర్పాటు పాకిస్థాన్‌తో పోలిక!

**ఇండియా-పాకిస్థాన్‌లా విభజించారంటూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు**

**రాష్ట్రాల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టిందని ఆరోపణ**

**రేవంత్ రెడ్డి 'హైబ్రిడ్ ఫార్ములా'పై సెటైర్లు..**

**తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే..**

**కాంగ్రెస్ ఎంపీల ధ్వజం**



**న్యూఢిల్లీ:** లోక్‌సభ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. గురువారం డీలిమిటేషన్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, తెలంగాణ ఏర్పాటును ఏకంగా ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడం కలకలం సృష్టించింది. బ్రిటిషర్ల కంటే హీనంగా కాంగ్రెస్ పార్టీ తెలుగు రాష్ట్రాలను విడదీసిందని, ఆనాడు అనుసరించిన అసంబద్ధ విధానాల వల్లే నేటికీ రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని ఆయన వివాదాస్పదంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ ఫార్ములా' (జీడీపీ ఆధారంగా సీట్ల కేటాయింపు)ను తేజస్వీ సూర్య తీవ్రంగా కొట్టిపారేశారు. ఈ ప్రతిపాదన అత్యంత తెలివితక్కువదని విమర్శిస్తూ.. "ఆదాయం ప్రకారం ఓట్లు ఇవ్వాలని అనుకుంటే, దేశంలో అత్యంత ధనికుడైన అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుంది" అని సెటైర్లు వేశారు. డీలిమిటేషన్ విషయంలో ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడమే విపక్షాల అసలు ఉద్దేశమని ఆయన ఆరోపించారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుపై బీజేపీకి ఉన్న అక్కసు మరోసారి బయటపడిందని ధ్వజమెత్తారు. అసలు సంబంధం లేని చర్చలో తెలంగాణ విభజనను తీసుకురావడం వెనుక ప్రధాని మోదీ, అమిత్ షాల ప్రోద్బలం ఉందని ఆరోపించారు. దాదాపు 46 నిమిషాల పాటు ప్రసంగించిన తేజస్వీ, ఎక్కువ సమయం తెలంగాణను, సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయడానికే కేటాయించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన తేజస్వీ సూర్యతో పాటు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు మరియు రాష్ట్ర బీజేపీ ఎంపీలు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్లమెంటు సాక్షిగా ఒక రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్‌తో పోల్చడం తెలంగాణ అమరవీరులను అవమానించడమేనని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ అంశంపై రాబోయే రోజుల్లో పార్లమెంటు లోపల, బయట పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూ బ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.

# ఇరాన్‌పై అమెరికా చమురు ఆంక్షల విధింపు

- హోర్ముజ్ జలసంధి వివాదంతో ముదిరిన ఉద్రిక్తతలు
- ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చర్యలు
- రెండు డజన్లకు పైగా కంపెనీలు, వ్యక్తులపై ట్రెజరీ శాఖ ఆంక్షలు
- భారత్ వంటి దేశాల రిఫైనరీలపై పడనున్న ప్రభావం



**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ చమురు పరిశ్రమపై అమెరికా కఠినమైన ఆంక్షలను ప్రకటించింది. ఇరాన్ ఆదాయ మార్గాలను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలతో పాటు, రెండు డజన్లకు పైగా వ్యక్తులు, కంపెనీలు మరియు ఓడలపై ఈ ఆంక్షలు ప్రభావం చూపుతాయని అధికారులు వెల్లడించారు. సముద్ర మార్గంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయాలకు గతంలో ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులను కూడా అమెరికా తక్షణమే రద్దు చేయడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వం 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను బందీగా మార్చుకుని ప్రపంచ దేశాలను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని, ఆ దేశ ఆదాయ సామర్థ్యాన్ని నిర్ణయాత్మకంగా కట్టడి చేసేందుకే తాము ఈ చర్యలు చేపడుతున్నామని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రత్యేక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇరాన్ ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి, అక్రమ మార్గాల్లో లాభపడాలని చూస్తున్న షమ్ఖానీ కుటుంబం వంటి ఉన్నత పాలక వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అస్థిరత సృష్టించాలనే ఇరాన్ ప్రయత్నాలను అడ్డుకుంటామని అమెరికా హెచ్చరించింది. కొద్ది రోజుల క్రితమే ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా 30 రోజుల పాటు తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. అయితే, ఇరాన్ తన పంథాను మార్చుకోకపోవడంతో మినహాయింపు గడువు తీరకముందే అమెరికా మళ్లీ కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి మరింత పెరగనుంది. ఇప్పటికే పశ్చిమ దేశాల ఆంక్షలతో సతమతమవుతున్న టెహ్రాన్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. అమెరికా విధించిన ఈ తాజా ఆంక్షల ప్రభావం భారత్ వంటి దేశాల రిఫైనరీలపై తీవ్రంగా పడనుంది. ఇరాన్ నుండి చమురును దిగుమతి చేసుకునే దేశాలకు ఇప్పుడు చెల్లింపులు మరియు రవాణా విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ముఖ్యంగా భారతీయ రిఫైనరీలు తమ ముడి చమురు అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్లోబల్ ఇన్సూరెన్స్ మరియు షిప్పింగ్ నిబంధనలు కఠినతరం కావడం వల్ల ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు మరింత కష్టతరం కానుంది. ఇది దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలకు కూడా దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో, అమెరికా తన నావికా దళాలను కూడా అప్రమత్తం చేసింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వాటా ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది, కాబట్టి దీనిపై నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇరాన్ ఈ ఆంక్షలకు ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అటు పశ్చిమ దేశాలు ఇరాన్‌ను దౌత్యపరంగా ఒంటరిని చేసేందుకు ప్రయత్నిస్తుండగా, ఇరాన్ మాత్రం తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామని ప్రతినబూనుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తప్పిన ప్రమాదం

**రన్‌వేపై ఆగివున్న ఆకాశ్ విమానాన్ని ఢీకొన్న స్పైస్‌జెట్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా



ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

# మరోమారు బీజేపీ తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

- తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే
- బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 16: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు పక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

# తెలంగాణ గ్లోబల్ బ్రాండ్

## పెట్టుబడులకు ఇదే సరైన సమయం!

### ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో దేశంలోనే నంబర్ వన్..

### అమెరికా 'నేషనల్ వార్ కాలేజీ' బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో పర్యటించిన అమెరికా ఉన్నత స్థాయి 'నేషనల్ వార్ కాలేజీ' ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. అమెరికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని, ఇక్కడ ఉన్న అనుకూలతలను వారికి వివరించాలని ప్రతినిధి బృందాన్ని కోరారు. రాష్ట్రంలో తయారవుతున్న ఉత్పత్తులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. "రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటిలోనూ 'మేడ్ ఇన్ తెలంగాణ' మార్క్ కనిపిస్తోంది" అని ఆయన గర్వంగా ప్రకటించారు. ఈ రంగం ఏటా 30 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని, ముఖ్యంగా 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ సాధించడం విశేషమని వివరించారు. హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా నిలిచిందని గుర్తుచేశారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని, టీజీ-ఐపాస్ ద్వారా కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతో పాటు 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ఇక్కడ విజయవంతంగా పనిచేస్తున్నాయని వివరించారు. అమెరికాకు ఒక నమ్మకమైన, దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలను అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలంగాణతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రెండు ప్రాంతాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేవీ కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా, ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్‌తో పాటు టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 26.. ఏపీలో 38 ఎంపీ స్థానాలు!

### డీలిమిటేషన్‌తో దక్షిణాదికే లాభం.. అమిత్ షా కీలక ప్రకటన

### జనాభా నిష్పత్తి కంటే ఎక్కువే సీట్లు.. విపక్షాల అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు

### కుల గణనకూ గ్రీన్ సిగ్నల్.. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధ్యం కాదు

### లోక్‌సభలో లెక్కలతో సహా వివరించిన కేంద్ర హోం మంత్రి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.



# తెలంగాణ అంటే అంత చులకనా?

### తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పాల్సిందే!

### దీనిపై బీజేపీ ఎంపీలు నోరు మెదపరా

### జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

# ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏడీఈ

### 30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



**నల్గొండ, ఏప్రిల్ 16:** రాష్ట్రంలో ప్రతిరోజు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏడీఈ సిరికొండ సైదులు గురువారం బాధితుడు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు. గత సంవత్సరం కంబాలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌పై పిడుగుపడి మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు అయిన రూ.10 లక్షల బిల్లుల కోసం అధికారిని సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నల్గొండ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

### ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు

### మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదఅని రామచందర్ రావు అన్నారు.



సంపాదకీయం

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా?

అంబేద్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేడ్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్ధంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రాక్రి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ పక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది. మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ పక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ పక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.



ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# మా వైఖరి మారదు..


## సోనియా గాంధీ స్పష్టం!



**న్యూఢిల్లీ :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పందించారు. ఈ బిల్లుల విషయంలో తమ పార్టీ నిర్ణయం ఏమిటో ఇప్పటికే స్పష్టంగా చెప్పామని, తాజాగా అదనంగా వివరించాల్సింది ఏమీ లేదని ఆమె మీడియాకు తెలిపారు. మహిళా బిల్లును సమర్థిస్తూనే, దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని ఆమె పరోక్షంగా పునరుద్ఘాటించారు. లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. అదేవిధంగా కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నియోజకవర్గాల బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. ఈ బిల్లులను సభలో చర్చకు అనుమతించాలా వద్దా అనే అంశంపై ప్రాథమిక ఓటింగ్ జరగ్గా, మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో బిల్లులపై సమగ్ర చర్చకు మార్గం సుగమమైంది. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరగనుంది. అవసరమైతే సమయాన్ని స్పీకర్ పొడిగిస్తారని కేంద్రం పేర్కొంది. రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది.

# ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

## మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ అక్కసు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.



# లోక్‌సభ సీట్ల సంఖ్య 815కు పెంపు

**మహిళా రిజర్వేషన్లపై మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక ప్రకటన**

**జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాతే మహిళా కోటా అమలు**

**మహిళలకు 272 సీట్లు కేటాయింపు.. రాష్ట్రాల ప్రాతినిధ్యానికి డోకా లేదు**

**131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో మహిళా సాధికారతకు బాటలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో డీలిమిటేషన్ మరియు మహిళా రిజర్వేషన్ బిల్లులపై జరిగిన చర్చలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచి, మొత్తం సీట్ల సంఖ్యను 815కు చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ విధానాన్ని, రాబోయే జనాభా లెక్కలు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయిన తర్వాతే పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు మంత్రి సభకు వివరించారు. లోక్‌సభ సామర్థ్యం 815 సీట్లకు పెరిగినప్పుడు, అందులో 33 శాతం కోటా ప్రకారం మహిళలకు 272 సీట్లు లభిస్తాయని మంత్రి లెక్కలతో సహా వివరించారు. ఈ ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, అన్ని రాష్ట్రాల సామర్థ్యం యథాతథంగా కొనసాగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. నియోజకవర్గాల పెంపు వల్ల పురుష సభ్యులకు కానీ, రాష్ట్రాలకు కానీ ఎటువంటి నష్టం వాటిల్లదని, ఇది కేవలం ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రక్రియ అని పేర్కొన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లు ద్వారా మహిళలకు రాజకీయాల్లో సమానత్వం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చర్చను ప్రారంభించిన మంత్రి తన ప్రసంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేసుకున్నారు. ఒక సమాజం ఎంత ప్రగతి సాధించిందో ఆ సమాజంలోని మహిళలు సాధించిన పురోగతి ఆధారంగానే అంచనా వేస్తామన్న అంబేద్కర్ వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల అంశాన్ని బలంగా సమర్థించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మాటలను కూడా ప్రస్తావించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే రోజులు వస్తాయని, అయితే దానికి కొంత సమయం పడుతుందని కలాం ఆనాడే చెప్పారని, ప్రధాని మోదీ నేతృత్వంలో ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చరిత్రాత్మక అడుగులు వేస్తోందని మంత్రి అభివర్ణించారు. ఈ బిల్లుల ద్వారా మహిళలకు చట్టసభల్లో నిర్ణయాత్మక పాత్ర లభిస్తుందని, ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని చెప్పారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల సామాజిక మార్పు వేగవంతం అవుతుందని, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు అందుతాయని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ తరాల మహిళలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనతో పార్లమెంటులో కొత్త ఉత్సాహం నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజనపై వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న సందేహాలను నివృత్తి చేస్తూనే, మహిళా రిజర్వేషన్ల అమలుపై స్పష్టమైన కాలపరిమితిని ప్రభుత్వం సూచించినట్లయింది. జనాభా లెక్కల ప్రక్రియ వేగవంతం కానుండటంతో, వచ్చే ఎన్నికల నాటికి కొత్త లోక్‌సభ నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చేసిన ఈ ప్రసంగం, దేశంలో మహిళా రాజకీయ చైతన్యానికి మరియు ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విస్తరణకు అద్దం పడుతోంది.

# జగన్‌పై నారా లోకేష్ ధ్వజం

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రం నుండి వెళ్లగొడతామని అనడం జగన్ యొక్క విధ్వంసకర మనస్తత్వానికి నిదర్శనమని లోకేష్‌ఘాటుగా వ్యాఖ్యానించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ తీరు కేవలం 'సైకోయిజం' తప్ప మరొకటి కాదని ఆయన సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. రాష్ట్రానికి వస్తున్న ఈ రక్షణ రంగ సంస్థ ద్వారా స్థానిక మత్స్యకారుల పిల్లలకు వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని లోకేశ్ వివరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంటే సంతోషించాల్సింది పోయి, కంపెనీని తరిమేస్తామని బెదిరించడం రాక్షస మనస్తత్వమే అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా అనేక పరిశ్రమలను రాష్ట్రం నుండి వెళ్లగొట్టిన చరిత్ర వైసీపీదని, ఇప్పుడు మరోసారి అదే పంథాను అవలంబిస్తూ యువత భవిష్యత్తును జగన్ నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షం తీరు రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోకేష్ తన పోస్ట్‌లో జగన్‌పై పరోక్షంగా వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. సొంత కుటుంబ సభ్యులనే దూరం చేసుకున్న వ్యక్తికి, దేశం పట్ల భక్తి గానీ, రాష్ట్రం పట్ల ప్రేమ గానీ ఉండదని విమర్శించారు. "తల్లిని తరిమేశారు, చెల్లిని గెంటేశారు.. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నింపుకున్న వ్యక్తికి దేశం అంటే ద్వేషం ఉండటంలో ఆశ్చర్యం లేదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కట్టిన నిర్మాణాలను కూలుస్తామని, అమరావతిని మారుస్తామని అనడం జగన్ యొక్క దుర్మార్గపు ఆలోచనలకు పరాకాష్ట అని ఆయన నిలదీశారు. రప్పా రప్పా నరుకుతాం అనే భాషను వాడుతూ భయోత్పాతం సృష్టించడం ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంటే, వైసీపీ మాత్రం ప్రతి అడుగులో అడ్డంకులు సృష్టిస్తోందని లోకేష్ మండిపడ్డారు. కంపెనీలను వెళ్లగొడతామని బెదిరించడం వల్ల భవిష్యత్తులో పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చేందుకు భయపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ తన రాజకీయ ఉనికి కోసం రాష్ట్ర భవిష్యత్తును పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధ్వంసకర రాజకీయాలను ప్రజలు ఎన్నటికీ క్షమించరని, అభివృద్ధి నిరోధకులైన వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం లోకేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ కంపెనీ మరియు మత్స్యకార యువత ఉద్యోగాల అంశం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తుంటే, ప్రతిపక్షం దానిని ఏ విధంగా అడ్డుకుంటుందో లోకేశ్ తన పోస్ట్ ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. జగన్ మోహన్ రెడ్డి వైఖరి మారకపోతే రాష్ట్రం మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో వైసీపీ శ్రేణుల నుంచి కూడా లోకేశ్ విమర్శలకు ప్రతిస్పందన వచ్చే అవకాశం ఉండటంతో ఏపీ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.

# జనగణనలో సరికొత్త అధ్యాయం

- స్వీయ నమోదు ప్రక్రియను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- దేశ చరిత్రలో తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో ఇంటింటి గణన
- ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసిన సీఎం
- ఈ నెల 30 వరకు ప్రజలకు స్వీయ నమోదు చేసుకునే అవకాశం



**అమరావతి, ఏప్రిల్ 16:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన ఇంటింటి గణన గృహాల జాబితా సేకరణ కార్యక్రమం గురువారం అత్యంత పకడ్బందీగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈసారి ప్రవేశపెట్టిన వినూత్నమైన 'స్వీయ నమోదు' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో స్వయంగా ఆరంభించారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తన కుటుంబ వివరాలను నమోదు చేయడం ద్వారా ఆయన ఈ డిజిటల్ జనగణనకు శ్రీకారం చుట్టారు. సాంకేతికతను అందిపుచ్చుకుని పారదర్శకమైన గణాంకాలను సేకరించే దిశగా ప్రభుత్వం వేసిన ఈ అడుగు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర జనాభా గణన సంచాలకులు జె. నివాస్ ఈ కార్యక్రమం యొక్క విశిష్టతను మరియు సాంకేతిక అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ స్వీయ నమోదు ప్రక్రియలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని, ఇవి కుటుంబ సభ్యుల వివరాలు, మౌలిక సదుపాయాలు మరియు గృహ వసతులపై ఉంటాయని తెలిపారు. అధికారుల వివరణ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారిక వెబ్‌సైట్ (se.census.gov.in)లోకి వెళ్లి విజయవంతంగా తన వివరాలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, గణాంకాల సేకరణలో మానవ తప్పిదాలకు తావుండదని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. జనగణన ప్రక్రియను మరింత సులభతరం మరియు వేగవంతం చేసేందుకు ప్రజలందరూ ఈ స్వీయ నమోదులో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు కల్పించింది. ఇలా నమోదు చేసుకున్న వారికి ఒక ప్రత్యేక కోడ్ లభిస్తుందని, తదుపరి దశలో ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ఆ కోడ్ చూపిస్తే సరిపోతుందని అధికారులు వివరించారు. దీనివల్ల ప్రజల గోప్యతకు భంగం కలగకుండా, వారి సౌలభ్యం ప్రకారం వివరాలు అందించే అవకాశం కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు ప్రాతిపదిక అని పేర్కొన్నారు. డిజిటల్ జనగణన ద్వారా లభించే సమాచారం వల్ల భవిష్యత్తులో విద్య, వైద్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనలో శాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ వెసులుబాటును వినియోగించుకుని ఏపీని డిజిటల్ జనగణనలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జనగణన విభాగం ఉన్నతాధికారులు మరియు ఐటీ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. గ్రామ మరియు వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజలకు ఈ ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా సులభంగా పూర్తి చేయగల ఈ ప్రక్రియపై ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. ముగింపులో, ఏప్రిల్ 30 తర్వాత ఎన్యూమరేటర్లు నేరుగా ఇళ్లకు వచ్చి మిగిలిన గణన ప్రక్రియను పూర్తి చేస్తారని అధికారులు వెల్లడించారు.

# మంత్రాలయంలో ఘోర ప్రమాదం

- ఎనిమిది మంది భక్తుల మృతి
- శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా విషాదం
- లారీ, బొలెరో వాహనం ఢీకొని ఎనిమిది మంది దుర్మరణం
- 12 మందికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు




**మంత్రాలయం, ఏప్రిల్ 16:** కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో తెల్లవారుజామున అత్యంత హృదయ విదారకమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. శ్రీ రాఘవేంద్రస్వామి వారి దర్శనం కోసం భక్తిశ్రద్ధలతో బయలుదేరిన భక్తుల ప్రయాణం అర్ధాంతరంగా విషాదాంతమైంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. పవిత్ర పుణ్యక్షేత్రానికి చేరుకోవడానికి కొద్ది దూరంలోనే మృత్యువు లారీ రూపంలో వచ్చి వారిని కబలించడం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వివరాల్లోకి వెళితే, కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మగళూరుకు చెందిన కొందరు భక్తులు ఒక బొలెరో వాహనంలో మంత్రాలయం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. వీరి వాహనం మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపానికి చేరుకోగానే, ఎదురుగా అతివేగంతో వస్తున్న ఒక రెడీమిక్స్ లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బొలెరో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో ఉన్న వారు లోపలే చిక్కుకుపోవడంతో హాహాకారాలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు మరియు స్థానికులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, వారి మృతదేహాలు వాహనం శిథిలాల మధ్య చెల్లాచెదురుగా పడి ఉండటం చూసిన వారిని కలిచివేసింది. గాయపడిన 12 మందిని పోలీసులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులంతా కర్ణాటక వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాద తీవ్రతను బట్టి అతివేగమే ఈ ఘటనకు ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. తెల్లవారుజామున కావడంతో మంచు కురవడం లేదా డ్రైవర్ నిద్రమత్తులోకి జారడం వంటి కారణాలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి వివరాలు సేకరించారు. బాధితులంతా ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో చిక్‌మగళూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుందామని వెళ్తున్న వారిని మరణం వెంటాడటం అందరినీ కన్నీటిపర్యంతం చేస్తోంది. ఈ ఘటనపై మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. పవిత్ర క్షేత్రం సమీపంలో ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం భక్తులలో తీవ్ర ఆందోళన నింపింది. పోలీసులు పంచనామా పూర్తి చేసిన అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# మంత్రాలయం రోడ్డు ప్రమాదంపై మంత్రి టీజీ భరత్ దిగ్భ్రాంతి

- క్షతగాత్రులకు పరామర్శ
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

**కర్నూలు, ఏప్రిల్ 16:** కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు ప్రమాదానికి గురై మరణించడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన మంత్రి, అధికారులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రి టీజీ భరత్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన వ్యక్తిగతంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలను కూడా క్షతగాత్రుల నుంచి సేకరించారు. ఆసుపత్రిలో వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీసి, తక్షణమే అవసరమైన అత్యవసర సేవలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి ఆసుపత్రి వైద్యులతో సమావేశమయ్యారు. క్షతగాత్రులకు ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఉన్నత స్థాయి చికిత్సకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూడాలని, బాధితుల ప్రాణాలను కాపాడటమే మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. వైద్యులకు ఏవైనా వసతులు కావాలంటే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్షతగాత్రుల సంరక్షణను తాము నిరంతరం పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి భరత్ వెల్లడించారు. మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్తూ మార్గమధ్యంలోనే భక్తులు మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాలు అనుభవిస్తున్న పుట్టెడు దుఃఖాన్ని ఎవరూ తీర్చలేరని, అయితే ప్రభుత్వం తరపున సాధ్యమైనంత మేర సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కర్ణాటకకు చెందిన బాధితుల వివరాలను సేకరించి, ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి చేశారు. అతివేగం, అజాగ్రత్త వల్ల అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రాలయం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గాల్లో భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని రవాణా మరియు పోలీసు శాఖలకు సూచించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విచారణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.





# సదాశివ నగర్ లో ప్రజా పాలన ప్రగతి గ్రామ సభ.



**సదాశివ నగర్ ఏప్రిల్16( సమయం న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రతి ఇంటికి అవగాహన కల్పించే బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలపై రైతులకు ప్రోత్సాహం కల్పించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ చొరవ తో త్వరలో మండలానికి ≈జ బస్ రానున్నదని సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం అందిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమలాంటి పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంబంధిత అధికారులు పథకం అమలులో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. rdo nv గిరి, drdo సురేందర్, ప్రత్యేక అధికారి సతీష్, dmho రవీందర్, తహసీల్దార్ సత్యం, సర్పంచ్ శిరీష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

-- తాగునీటి సమస్యలపై పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**జూలూరు పాడు ఏప్రిల్16( సమయం న్యూస్).** :జూలూరుపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, అనంతరం కరివారిగూడెం గ్రామంలో తాగునీటి పరిస్థితిని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మిషన్, తూకం యంత్రాలు, గ్రేడింగ్ యంత్రాలు తదితర సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం కొనుగోలు వివరాలు, ప్రస్తుత సీజన్ అంచనాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగుల నిల్వలపై సమాచారం సేకరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. అనంతరం కరివారిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించిన కలెక్టర్, తాగునీటి సరఫరాలో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. వేసవి కాలం మొత్తం తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

■ టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

■ అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు.... జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, ఏప్రిల్ 16( సమయం న్యూస్).** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. కొందరు లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలను వెల్లడిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా,టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ యంత్రాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించామని, ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడటం సర్పంచుల బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో సివిల్ సప్లై స్ ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ జరుగుతోందని, ఇప్పటికే 80 శాతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందుకు సర్పంచులు, ఎస్ హెచ్ జి మహిళలు సహకరించాలని కోరారు. ఈజీఎస్ కింద చేపట్టిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, గ్రామపంచాయతీ, అంగన్వాడి కొత్త భవనాల పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆయా సర్పంచులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐసి జీఎం తుల్జా నాయక్ , ఎంపీడీవో శ్రీనివాస్ , తహసిల్దార్ రవికుమార్ ,ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో 6 గ్యారంటీల అమలులో1000 కోట్లు లబ్ది.

■ జిల్లా కలెక్టర్ కే హైమావతి.



**సిద్ధిపేట ఏప్రిల్16( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజల మరియు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం 6 గ్యారంటీల అమలు కోసం 1000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో మండల స్థాయి సభ నిర్వహించారు. అందులో భాగంగా కొమరవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కొమరవెల్లి మండల స్థాయి సభలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల మండల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన ప్రజా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల వివరాలు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజులపాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని దానిలో భాగంగా ఈ నెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించామని, ఈరోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభను నిర్వహిస్తున్నామని అన్నారు. మే మాసంలో నియోజకవర్గ స్థాయి మరియు జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రతివారం ఒక డిపార్ట్మెంట్ థీమ్ ను తీసుకొని జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని మొదటివారం ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని, తర్వాత హెల్త్ వీక్, ఇప్పుడు అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు తప్పకుండా రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రన, రైతు సంక్షేమం, విద్యా కార్యక్రమాలు, క్రీడలు యువజన సంక్షేమం, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్ణీత ప్రణాళిక ప్రకారం 99 రోజులలో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం మరియు సేంద్రియ వ్యవసాయం చేసి పాటించి అధిక దిగుబడిని సాధించడంతోపాటు భూమి సారం పెరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో కొత్తగా 25 వేల రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాత రేషన్ కార్డులలో 37 వేల మంది సభ్యులను చేర్చి ప్రతినెల 6580 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో 11241 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా 9954 ఇండ్ల గ్రౌండింగ్ జరిగిందని 204 కోట్ల రూపాయల బిల్లులను చెల్లించడం జరిగిందని కొత్తగా ప్రతి నియోజకవర్గానికి మరొక 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ కోసం 22 కోట్ల 83 లక్షల రూపాయలు సబ్జరీ అందించడం జరిగిందని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు వినియోగించుకున్న లబ్ధిదారులకు 152 కోట్ల రూపాయల విలువైన ఉచిత విద్యుత్ అందించడం జరిగిందనీ, రైతు భరోసా పథకం ద్వారా మూడు లక్షల పదకొండు వేల మంది రైతుల ఖాతాలలో 392 కోట్ల రూపాయలను తాజాగా జమ చేయడం జరిగిందని, 330 కోట్ల రూపాయలు మహిళల ఉచిత బస్సు ప్రయాణం కు చెల్లించడం జరిగిందని, పేద ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమ, అభివృద్ధి కోసం 1 వెయ్యి కోట్ల రూపాయలు ఆరు గ్యారెంటీ ల ద్వారా జిల్లాలో ప్రభుత్వం ఖర్చు చేయడం తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని దానిలో భాగంగా మర్కుక్ మండలంలో ఈ విద్యా సంవత్సరం నుండి తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొండపాక మండల కేంద్రంలో 200 కోట్ల రూపాయలతో 16 ఎకరాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల జీవిత బీమా ప్రతి కుటుంబానికి లభిస్తుందని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ కాలేజీలలో కూడా ఉచిత మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయనున్నదని అదేవిధంగా ప్రైమరీ స్కూల్స్, హై స్కూల్స్ తో పాటు ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనున్నదని తెలిపారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వారి ద్వారా రహదారి భద్రత పై మరియు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ద్వారా పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిజ్ఞ చేయించారు. చివరిగా మహిళా శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తాసిల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు సర్పంచులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుపై డివిజన్ కోరిన విపక్షాలు

**(న్యూ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి) :** డీలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టడంపై ఓటింగ్ జరగాలని విపక్షాలు డిమాండ్ చేయగా ఆ మేరకు స్పీకర్ ఓటింగ్ జరిపారు. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా మెజార్టీ సభ్యుల ఓటు వేశారు. ఓటింగ్‌లో మొత్తం 436 మంది సభ్యులు పాల్గొనగా అనుకూలంగా 251 మంది ఓటు వేశారు. 185 మంది వ్యతిరేకించారు.

**లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు బిల్లులు...** ఓటింగ్ అనంతరం లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చల అనంతరం రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని స్పీకర్ తెలిపారు. బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చని చెప్పారు. సభలో సభ్యులందరికీ సమయం ఇస్తామని అన్నారు.

**మహిళా రిజర్వేషన్లను అమలుకు సమయం వచ్చింది : అర్జున్ రామ్ మేఘ్‌వాల్..** ఈ రోజు పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ అన్నారు. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ఆమోదం పొందిందని చెప్పారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేమని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 (2) ప్రకారం ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవచ్చని, అలాగే ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలకు పార్లమెంటుకు రాజ్యాంగం శక్తి ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. బిల్లు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని తెలిపారు. మహిళలకు సామాజిక న్యాయం కోసం కేంద్రం అనేక పథకాలు తెచ్చిందని, అలాగే శౌచాలయాలు, ఉజ్వల యోజన అమలు చేశామని వెల్లడించారు.

**మహిళ రిజర్వేషన్ బిల్లుపై మూడేళ్ల క్రితమే చర్చలు : గౌరవ్ గొగొయ్...** 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరుగుతోంది. మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయని, అప్పుడు చెప్పినవే ఇవాళ న్యాయశాఖ మంత్రి వినిపించారని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అన్నారు. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించి చట్టాలు వచ్చాయని అన్నారు. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దని పేర్కొన్నారు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తామని గతంలో హోంమంత్రి చెప్పారని తెలిపారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- డిఫెన్స్ డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు-ఎస్పీ.





**నారాయణపేట, ఏప్రిల్,16(సమయం న్యూస్):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం కింద గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ ఎస్.ఆర్ గార్డెన్ లో ఆటో, టాక్సీ, టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం, కలర్ బ్లైండ్ వంటి సమస్యలు రావచ్చుని, అందువల్ల డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలు సరిగా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గతంలో కంటి పరీక్షలు చేసుకున్న కొంతమందికి కళ్లద్దాలు అందించడం జరిగింది. ప్రస్తుతం కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడంతో పాటు తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందించబడతాయని చెప్పారు.ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. డ్రైవర్లు తప్పనిసరిగా డిఫెన్స్ డ్రైవింగ్ పాటించాలని, వేగ పరిమితులను మించకుండా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలను పాటించాలి, మద్యం సేవించి వాహనం నడపకూడదు, కారులో సీట్ బెల్ట్, ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదు, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. అలాగే వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు.ఈ శిబిరం ద్వారా 100 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో రామ్ చందర్, డీఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్, ఆర్టీఓ మేఘా గాంధీ, ఆర్టీఓ మెంబర్ పోశాల్ రాజేష్, సీఐ శివశంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరి నారాయణ బట్టడ్, కంటి వైద్య నిపుణులు డాక్టర్లు సునీల్, మల్లిక, సాయి ఆదిత్య, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ చరిత్రాత్మక నిర్ణయం: ఆకుల విజయ

**హైదరాబాద్ ఏప్రిల్16( సమయం న్యూస్):** : మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ మహిళా మోర్చా పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ స్పందిస్తూ, ఇది దేశ మహిళలకు గర్వకారణమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా నినాదంగా మాత్రమే ఉన్న మహిళా రిజర్వేషన్, ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో వాస్తవ రూపం దాల్చుతోందని అన్నారు."నారీ శక్తి వందన్ అధినియం" అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప విషయమని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు దేశాన్ని సమర్థంగా నడిపించగల సామర్థ్యం ఉన్నదని ఝాన్సీ లక్ష్మీబాయి, రాణీ రుద్రమదేవి, అహల్యాబాయి హోల్కర్ వంటి మహానుభావుల ఉదాహరణలతో వివరించారు.2029 ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందుకు మహిళా లోకం తరపున ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో లింక్ చేయడం "పెద్ద కుట్ర"

- కల్వకుంట కవిత



**హైదరాబాద్ ఏప్రిల్16( సమయం న్యూస్):** బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో లింక్ చేయడం "పెద్ద కుట్ర"గా అభివర్ణించారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్‌ను అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేశారు.పార్లమెంట్‌లో ప్రస్తుతం తెలంగాణకు ఉన్న 3.13% ప్రాతినిధ్యం డీలిమిటేషన్ తర్వాత కూడా తగ్గకూడదని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజకీయ ప్రాధాన్యం తగ్గించే ప్రయత్నాలు జరిగితే మరో తెలంగాణ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.అదేవిధంగా, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా తప్పనిసరిగా ఉండాలని కేంద్రాన్ని కోరారు.కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు రావడం లేదని, ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వడం లేదని కూడా ఆమె విమర్శించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

- డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి
- రోడ్లపై బాధ్యతగా మెలగాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీం నగర్ ఏప్రిల్16( సమయం న్యూస్).:** రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అరైవ్ – అలైవ్ కింద రోడ్ సేఫ్టీ పై అవగాహన సదస్సును రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు, శారీరక పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన వాహనాలను రోడ్లపైకి రాకుండా చూడాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడపకుండా చూడాలని పోలీస్ అధికారులు సూచించారు. వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ (ఆస్పత్రికి తీసుకెళ్లే) లోపు చేయాల్సిన ప్రాథమిక చికిత్స పై ప్రజలకు అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. మన పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం రాజు మాట్లాడుతూ.. మనదేశంలో ఏటా రెండు లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని వివరించారు.

**రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం మాట్లాడుతూ..** అతివేగం, అజాగ్రత్త, నిద్రలేమి, మైనర్లు వాహనాలు నడపడం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు.

ఎదిగిన పిల్లలు కళ్ళముందే చనిపోతే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత తెలంగాణకు కృషి చేయాలన్నారు.

**డిఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ** ప్రతి ఒక్కరూ సీపీఆర్, ప్రథమ చికిత్స పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ** రోడ్డు ప్రమాద బాధితుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రహవీర్ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు.ఆరోగ్యశ్రీ వర్తించే అన్ని ఆసుపత్రుల్లో రహవీర్ కింద రూ. లక్షన్నర వరకు వైద్య సహాయం అందిస్తారని వివరించారు. క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్చిన వారికి రహవీర్ కింద 25 వేల బహుమతి అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నిబంధనలను విద్యార్థులు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నాటిక ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, శాఖల అధికారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు సిపిఆర్ చేసే విధానం చేసి చూపించారు.

**డ్రైవర్లకు సన్మానం** ..రోడ్డు ప్రమాదాలు జరగకుండావాహనాలు నడిపిన జిల్లాలోని ఆర్టీసీ, లారీడ్రైవర్లతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్డీవో మహేశ్వర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ వినోద్ స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేతా రెడ్డి, రోడ్డు రవాణా శాఖ , వైద్య , ఆర్ అండ్ బి అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం మండల సభల ప్రధాన లక్ష్యం

- గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి
- ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం -- మండల సభల ప్రధాన ఉద్దేశం
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ ఏప్రిల్16( సమయం న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు.గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు.రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రతి ఇంటికి అవగాహన కల్పించే బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలపై రైతులకు ప్రోత్సాహం కల్పించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం అందిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమలాంటి పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సంబంధిత అధికారులు పథకం అమలులో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసాచారి ప్రత్యేక అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో, రఫీక్ ఉన్నిసా బేగం సర్పంచ్ ఇ. శేఖర్,.వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## బొంరస్ పేట గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన -జిల్లా కలెక్టర్

- విద్యార్థినిల ఆరోగ్యం,విద్యా పై ప్రత్యేక దృష్టి పెట్టాలని,
- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం ఉండాలి-
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి
- విద్యార్థిని లతో పాటు భోజనం చేసిన కలెక్టర్



**బొంరస్ పేట మండలం, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** విద్యార్థిని ల ఆరోగ్యం ,విద్యా పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారము భోజనం ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారము బొంరాస్ పెట్ గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భాంగా గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినుల విద్యా ప్రమాణాలు మరియు ఆరోగ్య పరిస్థితులను సమీక్షించారు.తరగతి గదులను పరిశీలించి బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి చదువు, సౌకర్యాలు, ఆరోగ్య సమస్యలపై సమాచారం సేకరించారు. ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, వారి శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. 9 వ తరగతి చదివే విద్యార్థిని లతో మాట్లాడుతూ వేసవి సెలవుల సందర్భంగా ఇండ్లకు వెళ్లి సెల్ ఫోన్స్ చూడటం చేయరాదని, వచ్చే సంవత్సరం పదవ తరగతికి వస్తారని, ముందుగానే తరగతి సిలబస్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, బాగా ఆచదువు కోవాలని ఆదేశించారు. పాఠశాలలో పరిశుభ్రత, పోషకాహారం, తాగునీరు, వసతి సౌకర్యాలపై ఎటువంటి లోపాలు ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య పరీక్షలను నిరంతరం నిర్వహించి, విద్యార్థినుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సిబ్బంది మరియు విద్యార్థుల హాజరు నమోదు రిజిస్టర్ లను పరిశీలించారు.ఉపాధ్యాయులు విద్యార్థినుల వ్యక్తిగత అభివృద్ధి, క్రమశిక్షణ, మరియు నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలిపారు.మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థిని లతో పాటు కలెక్టర్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మావతి, ఏం పి డి ఓ వెంకన్న గౌడ్, ఏం ఇ ఓ హరిలాల్,వార్డెన్ రాజన్న, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నార

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్
- మున్సిపల్ విలీన వార్డుల అభివృద్ధికి 30 కోట్లు: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి: మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష



**అదిలాబాద్ ఏప్రిల్16( సమయం న్యూస్). :** ప్రభుత్వం ఏదైనా అంతిమంగా ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్ అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక ఎస్టీయూ భవన్లో నిర్వహించిన మున్సిపల్ స్థాయి సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్ లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ముందుగా మున్సిపల్, వైద్య, పోలీస్ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని సమావేశంలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను అతిథులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు చేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాపారాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా అంతిమంగా ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయడానికి 99 రోజుల ప్రణాళిక చేపట్టడం జరిగిందని, అధికారులు ప్రజలవద్దకు వచ్చి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. దరఖాస్తుదారుల సమస్యలపై తీసుకున్న చర్యలపై లేఖల ద్వారా తెలియజేసేలా కొత్త నాందికి శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ వీలైన వార్డుల అభివృద్ధికి 30 కోట్లు కేటాయించడం జరిగిందని, పట్టణానికి శాశ్వత నీటి సమస్య పరిష్కారంతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం పటిష్టమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో నీటి పంపింగ్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్‌లో భాగంగా లండ సాగ్రి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. వచ్చే ఏడాది అక్టోబర్ నుండి జనవరి లోపు ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, ఇది పూర్తయితే వేసవిలో కూడా పట్టణానికి పుష్కలంగా నీరు అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ కౌన్సిల్, అధికారులు మరిన్ని కొత్త ప్రాజెక్టులను గుర్తించి డిటైల్డ్ రిపోర్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, మున్సిపాలిటీ యొక్క అంతర్గత వనరులను పెంచుకోవడం ద్వారా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపారు. జూన్ 2వ తేదీ నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ భరోసా బీమా' పథకాన్ని ప్రారంభించబోతుందని, దీని ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి చనిపోతే 5 లక్షల రూపాయల బీమా అందుతుందని వివరించారు. అదేవిధంగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ వరకు అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అర్హులైన వారికి పథకాలతోపాటు ఆయా శాఖల వారీగా చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా 99 రోజుల యాక్షన్ ప్లాన్ తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి శాఖకు వారం రోజుల సమయం కేటాయించి వారి నివేదికలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్, అదనపు కలెక్టర్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎల్డీఎం ఉత్పల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, సంక్షేమ అధికారి మిల్కా, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, తహసిల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నపూర్ణ, స్వాతి, ధోని జ్యోతి, చరణ్ గౌడ్, మున్న జైస్వాల్, గంట జీవన్, విజయ్, ఆత్రం వేంకటేష్, నాగ్ సేన్, మహెబూబ్, సంజయ్, అంగన్వాడీలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధి పనులను పరిశీలించిన...నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**కోస్గి మున్సిపల్, ఏప్రెల్16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పట్టణంలో నిర్మిస్తున్న సైన్స్ మ్యూజియం పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పక్కనే ఉన్న మున్సిపల్ పార్కును పరిశీలించారు. బస్టాండ్ మలుపు దారి వద్ద జంక్షన్ ఏర్పాటు కోసం అధికారులకు సూచనలు చేశారు. అలాగే రూ. 10.50 కోట్లతో కోస్గి పట్టణ డంపింగ్ యార్డ్ కు సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణ పనులను డంపింగ్ యార్డుకు వెళ్లి పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తాచెదారానికి నిప్పు ఎందుకు పెట్టారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. యార్డులో మిగిలిన ఇతర పనుల ఆలస్యంపై సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కోస్గి పట్టణంలో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ( మురుగునీటి వ్యవస్థ) పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తిస్థాయిలో పనులు కొనసాగడం లేదని, అసలు పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే ఆనవాళ్లే కనిపించడం లేదని కలెక్టర్ పబ్లిక్ హెల్త్, అర్ అండ్ బీ, మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని మూడు జోన్లుగా విభజించి చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఈ ఈ విజయ్ భాస్కర్ గూగుల్ మ్యాప్ తో కోస్గి పట్టణ స్వరూపం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (తుపాను నీటి పారుదల నెట్ వర్క్)మూడు జోన్ల నిర్మాణం గురించి చిత్ర పటం ద్వారా కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగు నీటి నిల్వ కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణంలో మందకొడిగా సాగుతున్నాయని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళి కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ. 305 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, హై మాస్ట్ లైట్లు, జంక్షన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, అప్రోచ్ రోడ్లు, మేజర్ లింక్ రోడ్స్, సీసీ, డ్రైనేజీల నిర్మాణాలు, చెరువుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితి గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ గంటన్నర పాటు చర్చించారు. అయితే కాంట్రాక్టర్ అభివృద్ధి నిర్మాణ పనులను కూలీలు లేరని, పండగలు ఉన్నాయనే కారణాలతో నిర్మాణ పనులను నెలల తరబడి నిలిపి వేస్తున్నాడని కోస్గి మున్సిపల్ చైర్మన్ ఎన్. నరేందర్, పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న మిగతా పనులను నిర్ణీత గడువు లోపే పూర్తి చేయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనులు ముందుకు సాగుతాయని, ఆయా శాఖల అధికారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కడ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, విద్యుత్ శాఖ ఎస్.ఈ. నవీన్, డి ఆర్ డి ఓ మొగులప్ప, పంచాయతీరాజ్ ఈ.ఈ. అశోక్, ఆర్ అండ్ బి అధికారి శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సరిత, మున్సిపల్ ఇంజనీర్, మేనేజర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**పట్టణ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.....** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం కోస్గి పట్టణంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ సభకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ ఎన్ నరేందర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పట్టణ సభ లో పాల్గొన్నారు. సభను జయ జయయే తెలంగాణ జననీ జయ కేతనం పాటతో ప్రాంభించారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు సభలో సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. కోస్గి మున్సిపాలిటీ సమగ్ర స్వరూపాన్ని, ఇంతవరకు మంజూరైన నిధులు చేసిన అభివృద్ధి పనులు, పట్టణంలో అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కమిషనర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం 290 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారని, అందుకుగాను 10 వేల కోట్లకు పైగా మహిళలకు ఆదా అయిందని తెలిపారు. అలాగే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందజేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## జావీద్ కు శ్రద్ధాంజలి ఘటించిన పలు సంఘాల నాయకులు



**ఖమ్మం , ఏప్రిల్ 16 : ( సమయం న్యూస్) :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందినసీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జావిద్ భౌతిక కయాన్ని సందర్శించిన పలు సంఘాల నాయకులుశ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం రెడ్ హిల్స్ ప్రాంతం లోజావిద్ఇంటిఆవరణలోప్రజల సందర్శనార్థం మహమ్మద్ జావిద్ భౌతిక కాయాన్ని ఉంచారు. వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. జ్యోతి , గౌరవ సలహాదారులుపుష్ప రజక , జేఏసీ కన్వీనర్బానోతు బద్రు నాయక్ ,వీరన్న నాయక్, ప్రకాష్ ,యాదవ్ , శివలాల్ తదితరులు పాల్గొనిశ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం , సానుభూతి ప్రకటించారు.

## శాసన మండలి చేపట్టిన అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి.

- చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.



**హైదరాబాద్ ఏప్రిల్ 16( సమయం న్యూస్). :** తెలంగాణ శాసన మండలి చైర్మన్ తన ఛాంబర్ లో నేడు ఆర్ ఆండ్ బి శాఖ , మరియు అఘాఖాన్ సంస్థ , తెలంగాణ లేజిస్లేచర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన మండలి లో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ గారి ఆదేశాల మేరకు శాసన మండలి , శాసన సభ మధ్యలో సెంట్రల్ హాల్ పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆయన తెలిపారు. శాసన మండలి సభ్యులకు , శాసన సభ సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్ డిజైన్ చేసి , పనులను త్వరగా ప్రారంభించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు , చైర్మన్ గారి ఓ.యస్ .డి గోవర్ధన్ రెడ్డి , పియస్ మోహన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## మీసేవా కేంద్రాలపై ఏసీబీ దాడులు

- 13 ప్రాంతాల్లో సోదాలు -- నకిలీ సర్టిఫికెట్లు, అక్రమ వసూళ్లు బహిర్గతం






**హైదరాబాద్, ఏప్రిల్ 16( సమయం న్యూస్).** రాష్ట్రవ్యాప్తంగా మీసేవా కేంద్రాలపై Anti-Corruption Bureau (ఏసీబీ) అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. మొత్తం 13 ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి .అల్వాల్‌లోని ప్రభుత్వ మీసేవా కేంద్రానికి ఆనుకుని ఉన్న జిరాక్స్ దుకాణంలో ఖాళీ కుల, నివాస, ఆదాయ, ఓబీసీ, ఈడబ్ల్యూ ఎస్ ధృవీకరణ పత్రాలకు సంబంధించిన అఫిడవిట్లు, నోటరీ స్టాంపులతో ఉన్న గ్రీన్ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఖాళీ పత్రాలను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వ సేవల కోసం ఉద్దేశించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో Bharatiya Nyaya Sanhita (బీఎన్ఎస్) సెక్షన్లు 318(2), 336(3) కింద కేసులు నమోదు చేశారు. మీసేవా కేంద్ర సిబ్బంది, మధ్యవర్తులు, అధికారుల మధ్య జరిగిన ఆర్థిక, యూపీఐ లావాదేవీలపై ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది. దళారుల వాట్సాప్ చాట్‌ల ద్వారా అనధికార కార్యకలాపాలు జరిగినట్లు గుర్తించారు. దరఖాస్తుదారుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఖమ్మం మీసేవా కేంద్రం జారీ చేసిన సర్టిఫికెట్లపై నకిలీ సంతకాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ తార్నాక సర్కిల్‌లోని శ్రీ సాయి కమ్యూనికేషన్ నెట్ కేంద్రంలో ప్రతి దరఖాస్తుకు నోటరీ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కొనసాగుతున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

## పౌష్టికహారంతో టీబి నియంత్రణ

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్....
- ఆధాని (గ్రూప్) సిమెంట్ కంపెనీ సహకారంతో టీబి బాధితులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



**తాండూర్,ఏప్రెల్,16(సమయం న్యూస్) :** పౌష్టికాహారం తీసుకోవడం వల్ల టీబీ,నియంత్రించడం సాధ్యమవుతుందని ఆధాని గ్రూప్స్ జనరల్ మేనేజర్ ఆర్ కె సరోజ్ అన్నారు. గురువారం ఆధాని సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో టీబీ, బాధితులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ,బారిన పడిన బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరైన సమయంలో వ్యాధులను గుర్తించి చికిత్సలు తీసుకుంటే నయం చేసుకోవచ్చన్నారు. అదేవి ధంగా బాధితులు పోషక విలువలు ఉన్న పౌష్టికాహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. తద్వారా వ్యాధులను నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీవుల్లా, ఆధాని సిమెంట్ కంపెనీ జనరల్ మేనేజర్ ఆర్ కె సరోజ్ , హెచ్ ఆర్ జయ ప్రకాష్ పాల్, దీపక్ కుమార్ ఆదిల్, ఆధాని గ్రూప్స్ కంపెనీ సిబ్బంది, మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.....

# “ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా.

- నవీన ఆదర్శ హైస్కూల్ లో స్థానిక డ్రైవర్ లకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎం.వి.ఐ శ్రీలక్ష్మి స్థానిక ఎస్సై జి.వి సత్యనారాయణ



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక భాగంలో.. డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన వికారాబాద్ జిల్లా రవాణా శాఖ (ఆర్టీవో) స్థానిక నవీన ఆదర్శ హైస్కూల్ లో కొడంగల్ స్థానిక డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్, శ్రీలక్ష్మి, స్థానిక కొడంగల్ ఎస్సై సత్యనారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది, రవాణా పోలీస్ సిబ్బంది, ఆప్తమాలజిస్ట్. వైద్య సిబ్బంది, నవీన ఆదర్శ హైస్కూల్ ప్రిన్సిపల్ డి. వి.నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష, ఉపాధ్యాయ బృందం పాల్గొని.. డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.

**జిల్లా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజు గారిని...మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా (ఐపీఎస్)**



**వికారాబాద్,ఏప్రిల్,10(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ డిస్ట్రబ్ అండ్ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజు గారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

-ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రమాదాలను అరికట్టాలి.

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**నారాయణపేట, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ( ప్రమాదకర ప్రదేశాలు) లో ఇకపై ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు రోడ్లకు సమీపములో ఉన్న స్కూల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్ల దగ్గర సూచిక బోర్డులు హజార్డ్ మార్కర్లు ఏర్పాటు చేయాలని, కల్వర్టుల దగ్గర రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ మాట్లాడుతూ.... కోసిగి సర్కిల్లో మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి 167 నాచారం అవుట్ స్టిక్కర్లు వేయాలన్నారు. మరికల్ సర్కిల్లో బ్లాక్ స్పాట్స్ టాప్ 10 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని తెలిపారు. నారాయణపేట సర్కిల్ ఇతర రహదారి మున్సిపాలిటీ పరిధిలో 2025లో 13మరణం సంభవించిందని 18 మంది గాయపడ్డారని తెలిపారు. నారాయణపేట సత్యనారాయణ ఎక్స్ రోడ్లు గత 72 మరణాలు సంభవించాయని మక్తల్ మున్సిపాలిటీలో 2025లో 10 మరణాలు తొమ్మిది మంది గాయపడ్డారని తెలిపారు. దండు ఎక్స్ రోడ్ నల్లజానమ్మ గుడి వద్ద, మక్తల్ బస్టాండ్ చందాపూర్ లో బ్లాక్ స్పాట్ ఉన్నాయని మన ప్రాంతాలలో భారీకేడ్లు సూచిక బోర్డులు జీబ్రా క్రాసింగ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికల్ టౌన్ పెద్ద చింతకుంట జాతీయ రహదారి రంబుల్ ట్రిప్స్ విత్ స్టడీస్ యాక్సిడెంట్ ఏరియా డ్రైవ్ స్లో తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్. ఈ వెంకట రమణ, డిఎస్పి నల్లపు లింగయ్య ,ఆర్టీవో మేఘా గాంధీ, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, ఆర్టీసీ డిఎం లావణ్య డీఈవో గోవిందరాజు డిఎం అండ్ హెచ్ ఓ జయచంద్ర మోహన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# “ప్రజా పాలన --ప్రగతి ప్రణాళిక కార్యచరణ ప్రణాళికలో”పాల్గొన్న మధుసూదన్ రెడ్డి



**చేవెళ్ల ఏప్రిల్ 16 (సమయం న్యూస్) :** మొయినాబాద్ మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కిషన్ రావు, వీణా సంధ్య, వీజూ మల్లయ్య,చూా అనురాధ అన్ని రంగాలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు....

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా.. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మండల సభ ఏర్పాటు

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**బొంరస్ పేట మండలం, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మండల సభ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.గురువారం బొంరాస్ పేట్ మండలం రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన మండల సభ లో పాల్గొన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మండల సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. మండల సభకు అధికారులతో కలిసి హాజరై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని, ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మండల సభల ద్వారా ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం,అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం,ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. 2026-27 సంవత్సరానికి ప్రైమరీ స్కూల్స్ కు అల్పాహారం, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం కొత్త పతకాలను ప్రభుత్వం ప్రవేశ పెడుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారందరికీ వంద శాతం ప్రభుత్వ పథకా ల అమలు జరుగుతుందని, మండల జనాభా ప్రకారము అభివ్రుది పనులు చేపడతామని , మీకు ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముందుగా సంబంధిత శాఖల వారిగా ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు చదివి వినిపించారు.ఈ సందర్భంగా పలు పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్లు , భూ సర్వే , పంచాయతీ, మండల అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్ పి సి ఇ ఓ సుధీర్ ,గ్రంథాలయ ఛైర్మెన్ రాజేశ్వర్ రెడ్డి, బొంరాస్ పేట్ తహసీల్దార్ పద్మావతి, ఎం పి డి ఓ వెంకన్న గౌడ్, సర్పంచ్ విరేశం , ఏం పి ఓ రవి ,జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి వికారాబాద్ చే జారి చేయబడినది.

# మున్సిపల్ చైర్పర్సన్ మరియు కమిషనర్ ఆదేశానుసారం

- మున్సిపల్ సాధారణ సమావేశం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి



**తాండూర్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ చైర్పర్సన్ మరియు కమిషనర్ ఆదేశానుసారంగా గురువారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి సంబంధించిన సమావేశ వివరాలను ఈ దిగువ తెలిపిన విధంగా తెలపనైనది.తాండూర్ మున్సిపాలిటీలో సమగ్రమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు రూ. 480 కోట్ల ప్రాజెక్టుకు, మంచినీటి సరఫరాకు అంతరామే ఏర్పడకుండా కాగ్న నది కోతపంపోసు వద్ద రూ.26 కోట్లతో చేపట్టి పనులకు సంబంధించి ప్రభుత్వానికి పంపించే ప్రతిపాదనలకు కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలిపింది. గురువారం చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఎజెండాలోని 20 అంశాలకు, టేబుల్ జెండా రెండు అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. పట్టణం నందు మురుగునీటి వ్యవస్థను సరిచేసి 13 ఎం ఎల్ డి సామర్థం గల ఎస్ టి పి నిర్మాణం చేయుటకు రూ.480 కోట్లతో తయారుచేసిన అంచనాల ప్రతిపాదనలను, నీటి సరఫరా సమస్యలను అధిగమించుటకు కాగ్న నది దగ్గర పాత, కొత్త పంప్ హౌస్ ల మరమ్మతు, ఇన్ ఫిల్టర్ రేషన్ బావులు, గ్యాలరీలతో పాటు కొత్తగా 6 ఎం ఎల్ డి సోమర్థ్యం గల డబ్ల్యుటిపి నీ నిర్మించుటకు రూ.26 కోట్లతో తయారుచేసిన అంచనాల ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించుటకు కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. ప్రతి వార్డులో సీసీడ్రైన్స్, కల్వర్టులు నిర్మించడానికి వార్డుకు రూ. 5 లక్షల చొప్పున 36 వార్డ్ లో చేపట్టేందుకు రూ కోటి 80 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించారు. 36 వార్డ్ లలో రూ. 90 లక్షలతో కొత్తగా బోర్లను డ్రిల్ చేసి మోటర్లు అమర్చుటకు తీర్మానించారు. వీధి జంతువుల జనాభా, ఏబీసీ కేంద్రం లో జంతు సంరక్షణ కేంద్రం తో పాటు అవసరమైన పరికరాలు, సామాగ్రి, మందులతో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయుటకు రూ. 17.50 లక్షలను కేటాయించారు. వాటర్ సప్లై మెయింటినెన్స్ కోసం రూ. 40 లక్షలు కేటా యిస్తూ పరిపాలన ఆమోదం తెలిపారు. రూ. 15 లక్షలతో మున్సిపల్ వాహనాల నిర్వాణ, మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు.

**ఇండస్ట్రియల్ ఎత్తివేతకు కౌన్సిల్ తీర్మానం...**మాస్టర్ ప్లాన్ లో ఇండ్రస్ట్రియల్, గ్రీన్, బఫర్ జోన్ ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్ గా మార్పు చేయుటకు ప్రభుత్వానికి పంపించేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఎమ్మెల్యే సూచన మేరకు పట్టణ ప్రణాళిక విభాగం మాస్టర్ ప్లాన్ లో అవసరమైన మార్పులు చేయుటకు ఈ ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, డి ఈ మణిపాల్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల“ప్రజా పాలన

-- ప్రగతి ప్రణాళిక”లో భాగంగా,

-- చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే

-- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు



**వికారాబాద్, ఏప్రిల్,16 (సమయం న్యూస్) :** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్” కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రత్యేక ఆదేశాల మేరకు మూడువ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విభిన్న కార్యక్రమాలను నిర్వహించారు.మూడవ రోజున ‘చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే’ ను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు.వికారాబాద్, తాండూర్, దౌల్తాబాద్, యాలాల్, బొంరాస్పేట్, చెన్గోముల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలలో తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సీటు బెల్ట్ మరియు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు ఎలా దాటాలి, స్కూల్ బస్సు ఎక్కేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల వేగ నియంత్రణపై పోలీసులు విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు.నవాబ్పేట్, పెద్దేముల్, దోమ, మోమిన్పేట్, బాషీరాబాద్ పాఠశాలల్లో “నాన్న నా కోసం, అమ్మ కోసం హెల్మెట్ కొను” అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం మరియు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు పోలీస్ అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరుతూ లేఖలు రాయించే కార్యక్రమాన్ని బంట్వారం, తాండూర్, దౌల్తాబాద్ పోలీస్ అధికారులు చేపట్టారు.పరిగి, చెన్గోముల్ మార్పల్లి మరియు దోమ మండలాల్లో స్కూల్ జోన్ బోర్డులు, బారికేడ్లు మరియు జీబ్రా క్రాసింగ్లను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తాండూర్,దుద్యాల ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో విద్యార్థులు, పోలీసులు మరియు వాలంటీర్లతో కలిసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేస్తూ మానవ హారం నిర్వహించారు.




# కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో అరైవ్ - అలైవ్ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొడంగల్ ఎస్సై జి.వి.సత్యనారాయణ
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన..

**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం కళాశాల ఎన్. ఎస్. ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన “అరైవ్ - అలైవ్” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్సై జి. వి సత్యనారాయణ హాజరై విద్యార్థులకు మరియు కళాశాల సిబ్బందికి రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మనిషి ప్రాణం ఎంతో విలువైనదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, సిగ్నల్ జంప్, రాంగ్ ఎంట్రీ, రాష్ డ్రైవింగ్ లకు పాల్పడ వద్దన్నారు. ప్రతి ఒక్కరూ నిర్దేశిత వయస్సు వచ్చిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించడం తప్పనిసరి అన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఆర్. శ్రీనివాస్, డా. ఇ. సోమ్లా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు

**రాయపోల్, ఏప్రిల్ 16:** సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి పౌరుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ,రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు,కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు, ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ కుటుంబ బీమా, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి సంక్షేమ పథకాలు అమలు కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి పూర్తి అవగాహన కల్పించి, ఎవరూ కూడా ఈ పథకాల నుంచి దూరం కాకుండా చూడాలని సర్పంచ్ లకు సూచించారు.



మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్ మాట్లాడుతూ రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతుబంధు,రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రబీ సీజన్‌లో త్వరలోనే కొనుగోలు ప్రారంభించనున్నట్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్సై మానస మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. యువత జాగ్రత్తగా వాహనాలు నడిపి తమ ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గొల్లపల్లి కనకయ్య మండల విద్యాధికారి రాజగోపాల్, మండల అధికారులు, సర్పంచులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో మంతూర్ గ్రామపంచాయతీ భవనం





● మధ్యలోనే వదిలేసిన నూతన గ్రామ పంచాయితీ భవనం

**రాయపోల్, ఏప్రిల్ 16:** రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పంచాయితీ పాలక వర్గం,గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం శివారు లోసుమారు 10 సంవత్సరాల క్రితం నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మధ్యలోనే వదిలివేయడంతో ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. మిగిలిన పనులు పూర్తి చేయకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇదే సమయంలో పాత భవనం కూడా దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి, కొత్త భవనానికి మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఢిల్లీలో రాజ్యసభ సభ్యునిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణస్వీకారం - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల ఏప్రిల్ 16 ( సమయం న్యూస్) ::** ఈరోజు ఢిల్లీలో రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ-స్వీకారం చేసిన శ్రీ వేం నరేందర్ రెడ్డి కి పార్లమెంట్ ఆవరణలో చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు గర్వకారణమని అన్నారు. రాష్ట్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, నిధులు సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన రాజ్యసభ సభ్యునికి అభినందనలు తెలిపారు.

## కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 15వ తేదీ నుండి మే నెల 7వ తేదీ వరకు దోస్త్ ద్వారా ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్)** : ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి మే నెల 7 వ తేదీ వరకు దోస్త్ (ఐూూ) ద్వారా ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని, ఈ నెల 30 నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని, మే 14న మొదటి దశ సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. కళాశాలలో బి. ఎ, బి. కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బి. ఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బి.ఎస్సీ లైఫ్ సైన్సెస్, బి.ఎస్సీ హెల్త్ కేర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ డీగ్రీ కళాశాల కొడంగల్, న్యాక్ "బి" గ్రేడ్ మరియు ఐ. ఎస్. ఓ గుర్తింపుతో, విశాలమైన తరగతి గదులు, ఆధునిక ప్రయోగ శాలలు, లైబ్రరీ, ఆటస్థలం, డిజిటల్ భోధన, అత్యున్నత అర్హతలు మరియు విశేష భోధనానుభవం గల అధ్యాపకులు, జిజ్ఞాస ప్రాజెక్టులు, క్షేత్ర పర్యటనల వంటి సహపాఠ్య కార్యక్రమాలు, ఎన్. ఎస్. ఎస్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల వంటి పాఠ్య ప్రణాళికేతర అంశాలు, నైపుణ్య శిక్షణ, ప్లేసెమెంట్ డ్రైవ్స్ వంటి విద్యార్థి పురోగతి కార్యక్రమాలు, గోల్డ్ మెడల్స్, స్కాలర్షిప్స్ వంటి ప్రోత్సాహక కార్యక్రమాలు తమ కళాశాల సొంతమన్నారు. తమ కళాశాల కోడ్ 3016 అని, దోస్త్ లో తమ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి చేరాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డా. వి. శ్రీధర్ కుమార్ ను 80083 91979 నంబరు ద్వారా సంప్రదించవచ్చునన్నారు.



## కొడంగల్ కేజీబీవీ కాలేజ్ విద్యార్థిని లకు సన్మానం...

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ కేజీబీవీ కాలేజ్ కి సంబంధించిన 25-26 ఇంటర్ ఫలితాలలో టాప్ మార్క్స్ సాధించిన విద్యార్థినిలకు సన్మానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె స్రవంతి తెలిపారు. ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ...మా కేజీబీవీ కాలేజ్ కు సంబంధించిన బైపిసి సెకండియర్ నుండి జి శిరీష బై ఎంపీసీ సెకండియర్ నుండి కే. అశ్విని ఎం. ఆనంద ఎంపీసీ ఫస్టియర్ నుండి ఎం. భవాని టి. శిరీష టి. అనూష బైపిసి ఫస్ట్ ఇయర్ నుండి యు. శ్రీ వర్ష పి. హరిత విద్యార్థులను కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వైస్ చైర్మన్ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ , కౌన్సిలర్స్ విద్యార్థులను ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. విద్యార్థినిలను ఫ్యూచర్లో ఏదైనా అవసరం వస్తే కూడా సహాయం చేస్తామని వారు తెలియజేశారన్నారు.

# జావిద్ కు తుది వీడుకోలు పలికిన డిప్యూటీ సీఎం భట్టి

రాహుల్ గాంధీతో పాటు పలువురు మంత్రుల సంతాపం



**ఖమ్మం , ఏప్రిల్ 16 :( సమయం న్యూస్ ):** సీనియర్ కాంగ్రెస్ నాయకులు , జననేత మహమ్మద్ జావిద్ కు గురువారం సాయంత్రం వీడ్కోలు పలికారు. బుధవారం మధ్యాహ్నం రో డు ప్రమాదంలో సూర్యాపేట జాతీయ రహదారి మధ్యలో మృతి చెందిన జావేద్ భౌతిక కాయాన్ని ఖమ్మంలో గల రెడ్ హిల్స్ లోని ఆయన స్వగృహం వద్ద తీసుకుని రాగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి నివాళులర్పించాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అనుచరుగా పేరుగాంచిన జావీద్ మృతదేహాన్ని సందర్శించిన విక్రమార్క నేడు జరిగిన ఆయన అంతిమయాత్రలో పాల్గొని , తుది వీడ్కోలు పలికారు. జిల్లాలోని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రు లు సంభాని చంద్రశేఖర్ , పువ్వాడ అజయ్ కుమార్ లతో పాటూ ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం జావిద్ మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు. రెడిల్స్ లోని ఇంటి నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కూడా సాయంత్రం జావిద్ ముతదేహాన్ని కొద్దిసేపు ఉంచిన అనంతరం ఖిల్లా లోపల ఆయన అంతిమ సంస్కారాన్ని నిర్వహించారు.

## "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "

● దోమల నివరణపై చర్యలు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్. స్వర్ణకుమారి ఆదేశానుసారం



**కొడంగల్ మండలం, ఏప్రిల్,16(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్. స్వర్ణ కుమారి మరియు జిల్లా కీటక జనిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్. రవీంద్ర యాదవ్, డాక్టర్. బుష్రా ఫాతిమా, వైద్యాధికారి ౧ాఎజ అంగడి రాయచూరు ఆదేశానుసారాము అంగడిరాయచుర్ గ్రామము లో కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్. పకిరప్ప పర్యవేక్షణలో ఫీవర్ సర్వే మరియు వడ దెబ్బ గురించి చెప్పడం జరిగింది ప్రజలకు దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, మరియు వక్తిగత పరిశుభ్రత ఒ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది, ఇట్టి కార్యక్రమములో హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి జయమాల ఏ.ఎన్.ఎం,ఆశలు అనసూయ, మంజుల పాల్గొన్నారు.

## షాబాద్‌లో 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' సమావేశం

● చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు



**చేవెళ్ల ఏప్రిల్ 16 ( సమయం న్యూస్) ::** "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యచరణ ప్రణాళికలో" భాగంగా ఈరోజు షాబాద్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, గ్రామాల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రామ్ రెడ్డి, ఎమ్మార్వో అన్వర్, గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీడీఓ అపర్ణ, ఏవో విజయ్ చంద్ర, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, అన్ని రంగాలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక ఉద్యమ స్ఫూర్తిదారుడు దళితరత్న అవార్డు గ్రహీత ఇటికల బిక్షపతి



**చేవెళ్ల ఏప్రిల్ 16 (సమయం న్యూస్) :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ ఏప్రిల్ 14 2026 జయంతి సందర్భంగా రవీంద్ర భారతి ఆడిటోరియం లో రాష్ట్ర మహనీయుల కమిటీ వైస్ చైర్మన్ బైరి వెంకటేష్ చేతులమీదుగా తెలంగాణ రాష్ట్ర మాస్తి హక్కుల పోరాట సమితి కన్వీనర్ ఇటిక్యాల బిక్షపతికి దళితరత్న అవార్డును ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం రోజు చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవన్ లో విద్యార్థి సంఘాల నాయకులు మరియు చేవెళ్ల మండలం, అంతారం గ్రామ యువ నాయకుడు మాదిగ నాగేష్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మాదిగ నాగేష్ మాట్లాడుతూ ఇటిక్యాల బిక్షపతి గత 40 ఏళ్ల నుండి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే రమాబాయి అంబేద్కర్ బాబు జగ్జీవన్ రావ్ సాహు మహారాజ్ లాంటి మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేసినటువంటి బావలు గల వ్యక్తి బిక్షపతి అని అన్నారు. విద్యార్థి సంఘ నాయకులు ఖానాపురం రాజేష్, అరుణ్ మాట్లాడుతూ ఇటిక్యాల బిక్షపతి సమాజశాస్త్రంలో ప్రావీణుడై ఎం వి ఎఫ్ ఫౌండేషన్ లో పనిచేస్తూ అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ సామాజిక స్ఫూర్తితో సామాజిక ఉద్యమకారుడిగా సమాజ మార్పు కోసం ఎంతో కృషి చేస్తున్నారని. పేద విద్యార్థుల చదువుల కోసం తన వంతు సహాయం చేస్తూ ఇతరులతో కూడా చేయిస్తూ పేద విద్యార్థులు చదువులకు తోడ్పాటునఅందిస్తున్న గొప్ప గుణగణాలు గల వ్యక్తి మన చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామానికి సంబంధించిన వ్యక్తి ఇటిక్యాల బిక్షపతి ఇలాంటి వ్యక్తికి దళిత రత్న అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని సమాజ సేవలో భాగంగా మరెన్నో అవార్డులు బిక్షపతికి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొజ్జంకి జైపాల్, శ్రీనివాస్, దయాకర్ సూర్యప్రకాష్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు లో 33 శాతం మహిళా బిల్లు పెట్టినందున

## హర్షం వ్యక్తం చేసిన రెండో వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,16(సమయం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ లో 33 శాతం మహిళా బిల్లు పెట్టినందువలన బి ఆర్ ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా మద్దతు తెలిపినందువలన, స్వాగతించి హర్షం వ్యక్తం చేసిన కొడంగల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ భారత ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ లో 33 శాతం రిజర్వేషన్ మహిళా బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ,, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం మహిళా బిల్లు పెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ మరియు పార్లమెంట్ సభ్యులకు అందరికీ, ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నట్లు చెప్పారు, మహిళలకు ముందు ముందు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలనీ కౌన్సిలర్ వాణిశ్రీ అన్నారు.



# బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్

## స్మృతి మంధానపై వీడియో క్రియేట్

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సెలెబ్రిటీలకు శాపంగా మారింది. మంచికి వాడాల్సిన సాంకేతికతను కొందరు ఆకతాయిలు తప్పుడు పనులకు ఉపయోగిస్తున్నారు. ఏఐ సాయంతో నకిలీ ఫొటోలు, వీడియోలను సృష్టించి పలువురు ప్రముఖుల పరువును బజారున పడేస్తున్నారు. కాదేదు నకిలీకి అనర్హం అన్న రీతిలో ఏఐ టెక్నాలజీని వాడుతున్నారు. క్రీడాకారులపై డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోలు రూపొందిస్తూ శునకానందం పొందుతున్నారు. పాత ఇంటర్వ్యూల వీడియోల సాయంతో అనని మాటలు అన్నట్లు మాయ చేస్తున్నారు. ఫేక్ అనే ఆలోచన కూడా రాకుండా వీడియో క్రియేట్ చేస్తున్నారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుటుంబం నుంచి విరాట్ కోహ్లీ వరకు చాలా మంది ఆటగాళ్లు ఈ నకిలీగాళ్లతో ఇబ్బంది పడ్డారు. తాజాగా భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు సంబంధించి ఓ ఫేక్ వీడియోను సృష్టించి నెట్టింట వైరల్ చేశారు. ఏ మాత్రం సందేహం రాకుండా.. నిజమేనని నమ్మేలా వీడియోను క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో హల్‌చల్ చేస్తోంది. స్మృతి మంధానకు సంబంధించి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూను కేటుగాళ్లు పూర్తిగా మార్చేసారు. ఆ ఇంటర్వ్యూలోని వాయిస్ తీసేసి ఏఐ సాయంతో కొత్త వాయిస్‌ని జోడించారు. టీమిండియా యువ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్ అని స్మృతి మంధాన చెప్పినట్లుగా ఈ వీడియోను క్రియేట్ చేశారు. ఈ నకిలీ వీడియోలో హోస్ట్.. టీమిండియా ఆటగాళ్లలో మీ క్రష్ ఎవరా? అని అడగ్గా.. స్మృతి మంధాన అభిషేక్ శర్మ పేరు చెప్పింది. అక్కడికే కట్ చేసి.. బీసీసీఐ అవార్డ్స్ ఫంక్షన్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఒకరినొకరు చూసుకున్నట్లుగా వీడియోను ఎడిట్ చేశారు. ఈ వీడియో నిజమేనని నమ్మిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. ఏఐ టూల్స్ ద్వారా ఈ వీడియోను క్రాస్ చెక్ చేయగా ఫేక్ అని తేలింది. అసలు ఏ ఇంటర్వ్యూలో కూడా మంధాన తన క్రష్ అభిషేక్ శర్మ అని చెప్పలేదు. ఏ హోస్ట్ కూడా టీమిండియాలో మీ క్రష్ ఎవరా? అని అడగలేదు. అడగరు కూడా. ఈ లాజిక్ గుర్తించిన జనాలు ఈ వీడియో నిజమేనని నమ్ముతున్నారు. చాలా ఇంటర్వ్యూలలో స్మృతి మంధాన తన క్రష్ గురించి అడిగినప్పుడు, తనకు చిన్నప్పటి నుంచి బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో స్మృతి మంధాన ప్రేమాయణం నడిపింది. కానీ వీరి వివాహం పెళ్లి పీటలపై ఆగిపోయింది. ఆ తర్వాత ఈ ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. పలాష్ ముచ్చల్‌కు ఇతర మహిళలతో సంబంధాలు ఉండటంతోనే స్మృతి పక్కనపెట్టిందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# వరల్డ్ టైటిల్ రేసులో వైశాలి

చెస్ ప్రపంచంలో భారత యువ కెరటం వైశాలి రమేష్ బాబు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కాండిడేట్స్ టోర్నమెంట్ 2026లో విజేతగా నిలిచి ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం జూ వెన్‌జున్‌తో తలపడే అవకాశాన్ని దక్కించుకుంది. ఆఖరి రౌండ్లో రష్యా క్రీడాకారిణి కటెరినా లగ్నోపై అద్భుత విజయం సాధించిన వైశాలి రమేష్ బాబు.. మొత్తం 14 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీంతో ప్లే-ఆఫ్స్ అవసరం లేకుండానే ఆమెను విజేతగా ప్రకటించారు. టోర్నీ ఆరంభంలో తక్కువ రేటింగ్ కలిగిన క్రీడాకారిణిగా బరిలోకి దిగిన వైశాలి, అసాధారణ ప్రతిభను కనబరిచింది. చివరి రౌండ్ మొదలయ్యే సమయానికి ఆరుగురు క్రీడాకారిణులు రేసులో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే వైశాలి తన ప్రత్యర్థి లగ్నోను తెలివిగా ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన రేటింగ్‌ను 26 పాయింట్ల వరకు పెంచుకోవడమే కాకుండా, తన కెరీర్‌లో అత్యుత్తమ మైలురాయిని చేరుకుంది. మరోవైపు బిబిసార అసౌబాయేవా తన చివరి గేమ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌తో డ్రా చేసుకుని రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఝూ జిన్నర్, అలెగ్జాండ్రా గోర్యాచ్కినా సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. వైశాలి గెలుపుపై భారత చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. "వైశాలి అద్భుతమైన సన్నద్ధతను, పట్టుదలను ప్రదర్శించింది. కష్టాలను ఎదుర్కొని విజయాన్ని అందుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారతీయులు ఉండటం గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో శిక్షణ పొందిన వైశాలికి ఈ విజయం చాలా ప్రత్యేకం. గతంలో గ్రాండ్ స్విస్ టైటిళ్లను గెలుచుకున్న వైశాలి, ఇప్పుడు ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్ బెల్టుపై కన్నేసింది. చెన్నైకి చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిని మరోసారి ఇనుమడింపజేసింది. రాబోయే టైటిల్ పోరులో ఆమె జూ వెన్‌జున్‌కు గట్టి పోటీనిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# కింగ్స్ సూపర్ హిట్‌షో

## ముంబైని చిత్తు చేసిన పంజాబ్





### అజేయంగా నిలిచిన డీకాక్ పోరాటం

### ఆకట్టుకున్న పంజాబ్ బౌలర్ల పనితీరు

### ఛేజింగ్‌లో సిక్సర్ల వర్షం కురిపించిన బ్యాటర్లు

### చేతులెత్తేసిన ముంబై బౌలింగ్ దళం

### ఏడు వికెట్ల తేడాతో మురిసిన పంజాబ్

**ముంబై, ఏప్రిల్ 16:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ముంబై వాంఖడే స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ జట్టు.. తొలుత ముంబైని నిర్ణీత 20 ఓవర్లలో 195/6 స్కోరుకు పరిమితం చేసింది. ఆ తర్వాత 196 పరుగుల లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. పంజాబ్ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. సొంత మైదానంలో ముంబైకి చేదు అనుభవం ఎదురైంది.

### ఒంటరి పోరాటం చేసిన డీకాక్

తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టులో ఓపెనర్ క్వింటన్ డీకాక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ కేవలం 60 బంతుల్లోనే 112 పరుగులతో అజేయంగా నిలిచి అద్భుత సెంచరీ సాధించాడు. అతనికి తోడుగా నమన్ ధీర్ 31 బంతుల్లో 50 పరుగులు చేసి రాణించాడు. వీరిద్దరూ మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా 12 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ తన పేస్‌తో ముంబైని దెబ్బతీశాడు. 4 ఓవర్లలో కేవలం 22 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ముంబై భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. శశాంక్ సింగ్, మార్కో జాన్సెన్ చెరో వికెట్ తీశారు.

### ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్ విధ్వంసం

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఎక్కడా తడబడలేదు. ఆరంభం నుంచే దాటిగా ఆడుతూ ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కేవలం 39 బంతుల్లోనే 80 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టు విజయానికి బాటలు వేశాడు. అతనికి జత కలిసిన శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి 35 బంతుల్లో 66 పరుగులు సాధించాడు. వీరిద్దరి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో పంజాబ్ టార్గెట్‌ను సునాయాసంగా కరిగించింది. చివర్లో కూపర్ కొన్నోలీ 12 బంతుల్లో 17 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో 21 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయం సాధించింది. ముంబై బౌలర్లలో అల్లా ఘజన్‌ఫర్ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి కాస్త మెరుగ్గా బౌలింగ్ చేసినా లాభం లేకపోయింది. శార్దూల్ ఠాకూర్ 3 ఓవర్లలో 42 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు. హార్దిక్ పాండ్యా 3 ఓవర్లలో ఏకంగా 39 పరుగులు సమర్పించుకుని తీవ్రంగా నిరాశపరిచాడు.




# బీసీసీఐకి చెన్నై సూపర్ కింగ్స్ ఫిర్యాదు!

**చెన్నై:** ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఉండే వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైదానంలో ఆటగాళ్ల మధ్య ఉండే పోటీ, మైదానం బయట అభిమానుల మధ్య ఉండే సోషల్ మీడియా వార్ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. అయితే, ఇప్పుడు ఈ వివాదం సరికొత్త స్థాయికి చేరుకుంది. మైదానం దాటి ఏకంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి గడప తొక్కింది. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్ సందర్భంగా ఆర్‌సీబీ ప్రదర్శించిన ఒక పాటపై సీఎస్‌కే మేనేజ్‌మెంట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారికంగా ఫిర్యాదు చేసింది. నివేదికల ప్రకారం, చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ మరియు సీఎస్‌కే తలపడిన సమయంలో, స్టేడియం స్పీకర్లలో ఒక వ్యంగ్య గీతాన్ని ప్లే చేశారు. అందులో దక్షిణ భారత ఆహార పదార్థాలైన 'దోశ-ఇడ్లీ'లను ప్రస్తావిస్తూ చెన్నై జట్టును, అక్కడి సంస్కృతిని తక్కువ చేసి చూపేలా పదప్రయోగాలు ఉన్నాయని సీఎస్‌కే వాదిస్తోంది. ఇది కేవలం క్రీడా స్ఫూర్తిని దెబ్బతీయడమే కాకుండా, ఒక ప్రాంతీయతను హేళన చేసేలా ఉందని చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ తన ఫిర్యాదులో పేర్కొంది. సాధారణంగా ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో జట్ల మధ్య 'బ్రాంటర్' (సరదా ఏడిపించుకోవడం) సహజం. కానీ, ఈసారి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ హద్దులు దాటిందని సీఎస్‌కే ప్రతినిధులు భావిస్తున్నారు. "ప్రతి జట్టుకు ఒక గౌరవం ఉంటుంది. ఆహారపు అలవాట్లు లేదా ప్రాంతీయ భాషలను ఉద్దేశించి వ్యంగ్యంగా పాటలు రూపొందించి స్టేడియంలో ప్లే చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది అభిమానుల మధ్య ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉంది" అని సీఎస్‌కే తన లేఖలో స్పష్టం చేసింది. ఈ ఫిర్యాదును అందుకున్న బీసీసీఐ వర్గాలు దీనిపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చాయి. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం.. ఏ ఫ్రాంచైజీ కూడా ఇతర జట్ల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించకూడదు. స్టేడియంలో ప్లే చేసే కంటెంట్ మరియు పాటలపై నియంత్రణ ఉండాలని, దీనిపై ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ వివరణ కోరతామని బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ వార్త బయటకు రావడంతో సోషల్ మీడియా వేదికగా ఇరు జట్ల అభిమానుల మధ్య యుద్ధం మొదలైంది. సీఎస్‌కే అభిమానులు 'బెంగళూరు మేనేజ్‌మెంట్ సంస్కృతి ఇదేనా?' అని ప్రశ్నిస్తుంటే, ఆర్‌సీబీ ఫ్యాన్స్ మాత్రం 'అది కేవలం సరదా కోసం చేసిన పని, దీనిని ఇంత పెద్దది చేయాల్సిన అవసరం లేదు' అని కౌంటర్ ఇస్తున్నారు. గతంలో కూడా కోహ్లీ-ధోనీ అభిమానుల మధ్య జరిగిన వివాదాలు ఇప్పుడు ఈ 'దోశ-ఇడ్లీ' గొడవతో మళ్లీ రాజుకున్నాయి.

# 22 ఏళ్ల తర్వాత సూర్య-త్రిష జోడీ..

## 'వీరభద్రుడు'పై పెరుగుతున్న అంచనాలు





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'కరుప్పు'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ సినిమాకు మంచి క్రేజ్ ఏర్పడింది. తెలుగులో ఈ చిత్రాన్ని 'వీరభద్రుడు' అనే శక్తివంతమైన టైటిల్‌తో విడుదల చేయాలని నిర్ణయించారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు ఆర్జే బాలాజీ తాజాగా మీడియాతో మాట్లాడిన సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ చిత్రంలో సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుండగా, సూర్య-త్రిష జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని కలిగిస్తోంది. గతంలో 'ఆరు' సినిమాలో కలిసి నటించిన ఈ జంట, దాదాపు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిసి నటించడం విశేషం. త్రిషతో పని చేయడం గురించి బాలాజీ మాట్లాడుతూ, చాలా కాలంగా ఆమెతో సినిమా చేయాలనుకున్నానని, ఈ ప్రాజెక్ట్ ద్వారా అది సాకారమైందని తెలిపారు. కథ వినగానే త్రిష వెంటనే అంగీకరించిందని, షూటింగ్ పూర్తయ్యాక కూడా ఆమె తరచూ సెట్స్‌కు వచ్చి యూనిట్‌ను ప్రోత్సహించిందని చెప్పారు. ఇక ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా మొదట ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌ను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని బాలాజీ వెల్లడించారు. 'మూకుతి అమ్మన్' తర్వాత కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ, 'కరుప్పు' షూటింగ్ సమయంలో ఆయన పూర్తి సమయం కేటాయించలేనని చెప్పడంతో నిరాశ కలిగిందని పేర్కొన్నారు. అయితే మధ్యలో ఒక పాట అత్యవసరం కావడంతో, సాయి అభ్యంకర్‌ను సంగీత దర్శకుడిగా తీసుకున్నామని తెలిపారు. మొత్తానికి, సూర్య-త్రిషల మధ్య కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ అంచనాల నడుమ 'వీరభద్రుడు' ప్రేక్షకులను ఎంత మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



### బ్లాక్‌బస్టర్ లేకపోయినా

# స్టైల్‌తో దుమ్మురేపుతున్న డింపుల్ హయాతి

తెలుగు, తమిళ చిత్రాల్లో 2017 నుంచి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న నటి డింపుల్ హయాతి, ఇప్పటివరకు పెద్ద హిట్ సాధించకపోయినా తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. సినిమాల కంటే ఆమె స్టైల్, గ్లామర్ కారణంగానే సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చకు వస్తోంది. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డార్క్ బ్రౌన్ లేస్ దుస్తుల్లో కనిపించిన డింపుల్ ఎంతో హాట్‌గా, ఆకర్షణీయంగా కనిపించింది. వదిలేసిన కర్లీ జుట్టు, ఎక్స్‌ప్రెసివ్ కళ్ల చూపులు, కూల్‌గా కనిపించే ఆమె అటిట్యూడ్ అన్నీ కలిపి ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఎటువంటి ప్రత్యేక సందర్భం లేకపోయినా, కేవలం తన లుక్‌తోనే డింపుల్ హయాతి సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. గ్లామర్, కాన్ఫిడెన్స్ కలయికతో ఆమె అభిమానులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది.

### 'పెద్ది'లో మాస్ సాంగ్‌కు కొత్త గ్లామర్..

# ఆయేషా ఖాన్ ఎంట్రీ?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై మరో ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలో ప్రత్యేకంగా రూపొందిస్తున్న మాస్ మసాలా పాట కోసం బాలీవుడ్ యంగ్ నటి ఆయేషా ఖాన్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఇటీవల 'ధురంధర్' సినిమాలోని 'షరారత్' పాటతో సోషల్ మీడియాలో విపరీతమైన గుర్తింపు పొందిన ఆయేషా, తన డ్యాన్స్ మరియు గ్లామర్‌తో యూత్‌ను ఆకట్టుకుంది. ఆ పాటలో ఆమె ప్రదర్శన చూసిన దర్శకుడు బుచ్చిబాబు, రామ్ చరణ్ సరసన ప్రత్యేక సాంగ్‌కు ఆమెనే సరైన ఎంపికగా భావించినట్లు తెలుస్తోంది. చరణ్ వంటి ఎనర్జిటిక్ డ్యాన్సర్ పక్కన ఆయేషా ఉంటే, ఆ పాటకు మరింత క్రేజ్ రావడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఈ స్పెషల్ సాంగ్ కోసం మృణాల్ ఠాకూర్, మానస వారణాసి పేర్లు వినిపించినప్పటికీ, ప్రస్తుతం యువతలో ఉన్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయేషా ఖాన్ వైపు చిత్రబృందం మొగ్గు చూపినట్లు టాక్. ఈ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఊర మాస్ ట్యూన్ సిద్ధం చేస్తున్నారని, అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. మొదట ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమైన ఈ సినిమా, షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం కారణంగా జూన్ 2026కి వాయిదా పడింది. అయితే, ఈ గ్యాప్‌లో వస్తున్న అప్‌డేట్లు మెగా అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయేషా ఖాన్ స్పెషల్ సాంగ్ ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.





# తమన్నాకు కోర్టులో నిరాశ..

## పవర్ సోప్స్‌పై పిటిషన్ తిరస్కరణ

నటి తమన్నా భాటియా దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 'పవర్ సోప్స్' కంపెనీపై ఆమె చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు సమర్పించలేకపోయినందున, కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇద్దరి మధ్య 2008లో బ్రాండ్ ప్రమోషన్‌కు సంబంధించిన ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం 2009 అక్టోబర్ వరకు మాత్రమే తమన్నా ఫోటోలను కంపెనీ ఉపయోగించుకోవాల్సి ఉంది. అయితే గడువు ముగిసిన తర్వాత కూడా 2010-2011 మధ్య తన చిత్రాలను అనుమతి లేకుండా వినియోగించారని తమన్నా ఆరోపించారు. ఈ నేపథ్యంలో కంపెనీపై చర్యలు తీసుకోవాలని, అలాగే తన ఫోటోలను ఇకపై ఉపయోగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన ఆమె, రూ.కోటి నష్టపరిహారం కూడా కోరారు. ఈ కేసులో ముందుగా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆమె మరో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ అప్పీల్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసనం, సింగిల్ జడ్జి తీర్పునే సమర్థిస్తూ తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ వ్యవహారంలో ఆమెకు న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131



# ఖర్చు పెట్టిన డబ్బు తిరిగి ఇచ్చేయండి

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాం

**తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడి సంచలన ఆఫర్**

**సత్యవేడులో రాజ్యాంగం అమలు కావడం లేదని సుమన్ ధ్వజం**


**దళిత ఎమ్మెల్యేను వేధిస్తారా అంటూ పార్టీ నేతలపై ఆగ్రహం**

**సత్యవేడు, ఏప్రిల్ 16:** చిత్తూరు జిల్లా సత్యవేడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు సుమన్ పార్టీ నాయకత్వానికి అత్యంత సంచలనమైన ఆఫర్ ఇచ్చారు. గత ఎన్నికల్లో తాము నియోజకవర్గంలో ఎంతో కష్టపడి, భారీగా ఖర్చు పెట్టి గెలిచామని, ఆ ఖర్చు పెట్టిన డబ్బును తమకు తిరిగి ఇచ్చేస్తే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని ఆయన బహిరంగంగా ప్రకటించారు. సొంత పార్టీలోని వారే తన తండ్రిపై కుట్రలు చేస్తున్నారని, గౌరవం లేని చోట పార్టీలో కొనసాగడం తమకు ఇష్టం లేదని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈ పరిణామాలు ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై సుమన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా ఒక ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో అగ్రవర్ణాల వ్యక్తిని ఇన్‌చార్జ్‌గా ఎలా నియమిస్తారని ఆయన పార్టీ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. ఇది దళిత సామాజిక వర్గాన్ని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సత్యవేడులో అమలు కావడం లేదని, దళిత ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు శ్రమించిన తమకు ఇప్పుడు దక్కుతున్న మర్యాద ఇదేనా అని ఆయన నిలదీశారు. స్థానిక పోలీసు అధికారుల తీరుపై కూడా సుమన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సత్యవేడు సీఐ ప్రతిరోజూ ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను దగ్గరుండి చేయిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తమ మాట చెల్లకుండా చేస్తున్నారని, అధికారులే అక్రమాలకు పాల్పడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధిగా ఉన్న తన తండ్రికి అండగా నిలవాల్సిన వారే కుట్రలు పన్నుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో పదవిలో కొనసాగడం కంటే తప్పుకోవడమే మంచిదని తాము భావిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం కుటుంబం నుంచి వచ్చిన ఈ ప్రకటనతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఎన్నికల్లో ఖర్చు చేసిన ప్రతి పైసా తమకు తిరిగి ఇచ్చేయాలని, అప్పుడే రాజీనామా లేఖను సమర్పిస్తామని సుమన్ చెప్పడం చర్చకు దారితీసింది. డబ్బు పెట్టి, కష్టపడి గెలిచిన సీటును అన్యాయంగా వేరే వారి చేతుల్లో పెట్టాలని చూడటం సరికాదని హితవు పలికారు. దళిత ఎమ్మెల్యేపై జరుగుతున్న ఈ వివక్షను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో దీనికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఈ వ్యవహారంపై టీడీపీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. సొంత పార్టీ ఎమ్మెల్యే కుమారుడే బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల పార్టీ ప్రతిష్టకు భంగం కలుగుతుందని నేతలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాలతో ముందుకు వెళ్తుంటే, మరోవైపు ఇలాంటి అసమ్మతి జ్వాలలు ఎగసిపడటం పార్టీలో కలకలం రేపుతోంది. దీనిపై ఎమ్మెల్యే ఆదిమూలం నేరుగా స్పందిస్తారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తప్పిన ప్రమాదం

**రన్‌వేపై ఆగివున్న ఆకాశ్ విమానాన్ని ఢీకొన్న స్పైస్‌జెట్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** దేశ రాజధాని దిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. దిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.



# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



**అమరావతి, ఏప్రిల్ 16:** ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40–45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో సగటు గరిష్ఠఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45–47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.

# 'నారీ శక్తి వందన్ అధినియం' చరిత్రాత్మక ముందడుగు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లపై పవన్ కల్యాణ్ హర్షం
- మహిళలు ఎదిగితేనే దేశం ఎదుగుతుందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళా మూర్తులకు ప్రశంసలు



**అమరావతి, ఏప్రిల్ 16:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' దేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొనియాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం మరియు నిర్ణయాత్మక శక్తి లభిస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఎల్లప్పుడూ చేతలతో మద్దతుగా నిలుస్తుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, 2019 ఎన్నికల సమయంలోనే తాము మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల వాగ్దానం చేశామని గుర్తు చేశారు. సామాజిక సమానత్వం మరియు సరైన ప్రాతినిధ్యంపై తమకున్న నిబద్ధతకు ఈ మద్దతు నిదర్శనమని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు. ఇది మహిళలకు కొత్తగా హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడమేనని అభిప్రాయపడ్డారు. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారని, తద్వారా బలమైన దేశ నిర్మాణం జరుగుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇకపై 'నారీ శక్తి' అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాదని, మన నాగరికతకు అది వెన్నెముకగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయమైన, సమానమైన మరియు సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో అందరూ కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల సామాజిక సమస్యల పరిష్కారంలో సరికొత్త దృక్పథం వస్తుందని ఆయన విశ్లేషించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న భారతీయ మహిళా మూర్తులను పవన్ కల్యాణ్ కొనియాడారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కు పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి సృష్టించిన చరిత్రను ఆయన ప్రస్తావించారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ వంటి వారి నుంచి క్రీడా రంగంలో పీవీ సింధు, మీరాబాయి చాను, నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ప్రతిభకు సరైన అవకాశం తోడైతే మహిళలు అద్భుతాలు చేస్తారని ఈ విజయాలు నిరూపిస్తున్నాయని చెప్పారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్ వంటి మహనీయుల సేవలను కూడా పవన్ స్మరించుకున్నారు. మహిళలు నాయకత్వం వహించినప్పుడు సమాజం వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నారీ శక్తి వందన్ అధినియం బిల్లు అమలులోకి రావడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని రాజకీయ నాయకత్వాలు మహిళల నుంచి ఉద్భవిస్తాయని ఆకాంక్షించారు. ఈ బిల్లును తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వానికి మరియు

# ఇరాన్‌పై అమెరికా చమురు ఆంక్షల విధింపు

- హోర్ముజ్ జలసంధి వివాదంతో ముదిరిన ఉద్రిక్తతలు
- ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చర్యలు
- రెండు డజన్లకు పైగా కంపెనీలు, వ్యక్తులపై ట్రెజరీ శాఖ ఆంక్షలు
- భారత్ వంటి దేశాల రిఫైనరీలపై పడనున్న ప్రభావం



**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ చమురు పరిశ్రమపై అమెరికా కఠినమైన ఆంక్షలను ప్రకటించింది. ఇరాన్ ఆదాయ మార్గాలను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలతో పాటు, రెండు డజన్లకు పైగా వ్యక్తులు, కంపెనీలు మరియు ఓడలపై ఈ ఆంక్షలు ప్రభావం చూపుతాయని అధికారులు వెల్లడించారు. సముద్ర మార్గంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయాలకు గతంలో ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులను కూడా అమెరికా తక్షణమే రద్దు చేయడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వం 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను బందీగా మార్చుకుని ప్రపంచ దేశాలను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని, ఆ దేశ ఆదాయ సామర్థ్యాన్ని నిర్ణయాత్మకంగా కట్టడి చేసేందుకే తాము ఈ చర్యలు చేపడుతున్నామని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రత్యేక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇరాన్ ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి, అక్రమ మార్గాల్లో లాభపడాలని చూస్తున్న షమ్ఖానీ కుటుంబం వంటి ఉన్నత పాలక వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అస్థిరత సృష్టించాలనే ఇరాన్ ప్రయత్నాలను అడ్డుకుంటామని అమెరికా హెచ్చరించింది. కొద్ది రోజుల క్రితమే ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా 30 రోజుల పాటు తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. అయితే, ఇరాన్ తన పంథాను మార్చుకోకపోవడంతో మినహాయింపు గడువు తీరకముందే అమెరికా మళ్లీ కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి మరింత పెరగనుంది. ఇప్పటికే పశ్చిమ దేశాల ఆంక్షలతో సతమతమవుతున్న టెహ్రాన్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. అమెరికా విధించిన ఈ తాజా ఆంక్షల ప్రభావం భారత్ వంటి దేశాల రిఫైనరీలపై తీవ్రంగా పడనుంది. ఇరాన్ నుండి చమురును దిగుమతి చేసుకునే దేశాలకు ఇప్పుడు చెల్లింపులు మరియు రవాణా విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ముఖ్యంగా భారతీయ రిఫైనరీలు తమ ముడి చమురు అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్లోబల్ ఇన్సూరెన్స్ మరియు షిప్పింగ్ నిబంధనలు కఠినతరం కావడం వల్ల ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు మరింత కష్టతరం కానుంది. ఇది దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలకు కూడా దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో, అమెరికా తన నావికా దళాలను కూడా అప్రమత్తం చేసింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వాటా ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది, కాబట్టి దీనిపై నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇరాన్ ఈ ఆంక్షలకు ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అటు పశ్చిమ దేశాలు ఇరాన్‌ను దౌత్యపరంగా ఒంటరిని చేసేందుకు ప్రయత్నిస్తుండగా, ఇరాన్ మాత్రం తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామని ప్రతినబూనుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.



# తత్వవేత్త నుంచి రాష్ట్రపతి వరకు..

## నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్థంతి

భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు.. ఆయన ప్రపంచం మెచ్చిన గొప్ప తత్వవేత్త మరియు విద్యావేత్త. భారతీయ తత్వశాస్త్రంలోని లోతును పాశ్చాత్య దేశాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తన నిశితమైన ఆలోచనలతో, వాగ్ధాటితో ప్రపంచ వేదికలపై భారతదేశ కీర్తిని చాటిన రాధాకృష్ణన్, భారతీయ మహర్షుల కోవకు చెందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. 1888 సెప్టెంబర్ 5న తిరుత్తణిలో ఒక సామాన్య తెలుగు కుటుంబంలో రాధాకృష్ణన్ జన్మించారు. తండ్రి వీరస్వామి ఒక జమీందారీలో తహసీల్దారుగా పనిచేసేవారు. చిన్నతనంలో పేదరికాన్ని అనుభవించినా, చదువుపై ఉన్న మక్కువతో స్కాలర్‌షిప్పుల ద్వారా తన విద్యను కొనసాగించారు. భోజనం చేయడానికి అరిటాకు కొనలేని స్థితిలో నేలపై తిన్న రోజులు కూడా ఆయన జీవితంలో ఉన్నాయి. అయితే, ఆ పేదరికమే ఆయన్ను మరింత పట్టుదలతో చదివించి, కేవలం 21 ఏళ్లకే మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్‌గా మార్చింది. ఆ తర్వాతి కాలంలో మైసూర్, కలకత్తా విశ్వవిద్యాలయాల్లోనూ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోనూ ఆచార్యుడిగా తన సత్తా చాటారు.

### రాజనీతిజ్ఞుడిగా బాధ్యతలు

రాధాకృష్ణన్ కేవలం విద్యా రంగానికే పరిమితం కాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రష్యాలో భారత రాయబారిగా నియమితులై, స్టాలిన్ వంటి కఠిన నేతలను కూడా తన విజ్ఞతతో ఆకట్టుకున్నారు. 1952 నుంచి 1962 వరకు ఉపరాష్ట్రపతిగా, ఆపై 1967 వరకు రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. చైనా, పాకిస్థాన్‌లతో యుద్ధం వంటి క్లిష్ట పరిస్థితుల్లో అప్పటి ప్రధాన మంత్రులకు తన దూరదృష్టితో మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రపతిగా వస్తున్న వేతనంలో కేవలం 25 శాతం మాత్రమే తీసుకుని, మిగిలిన మొత్తాన్ని ప్రధానమంత్రి సహాయ నిధికి తిరిగి ఇచ్చేసి తన నిరాడంబరతను చాటుకున్నారు.

### గురుశిష్యుల బంధానికి ప్రతీక:

ఆయన రాష్ట్రపతిగా ఉన్న సమయంలో విద్యార్థులు, అభిమానులు ఆయన పుట్టినరోజును వైభవంగా జరపాలని కోరారు. దానికి ఆయన స్పందిస్తూ, "నా పుట్టినరోజును ప్రత్యేకంగా జరపడం కంటే, ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరిపితే నాకు అంతకంటే గౌరవం మరొకటి ఉండదు" అని చెప్పారు. అప్పటి నుంచే సెప్టెంబర్ 5ను మనం 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకుంటున్నాము. 1954లో భారతరత్న పురస్కారంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా గౌరవ డాక్టరేట్లు అందుకున్న రాధాకృష్ణన్, భారతీయ సంస్కృతికి మరియు విద్యా వ్యవస్థకు ఒక నిరంతర స్ఫూర్తిప్రదాతగా నిలిచిపోతారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494


# బహుముఖ ప్రజ్ఞాశాలి బెంజమిన్ ఫ్రాంక్లిన్

## నిర్లక్ష్యం చేస్తే కనుమరుగు ఖాయం

### నేడు బెంజమిన్ ఫ్రాంక్లిన్ వర్ధంతి

(ఇద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)

బెంజమిన్ ఫ్రాంక్లిన్ (జనవరి 17, 1706 – ఏప్రిల్ 17, 1790) అమెరికా విప్లవంలో పాల్గొని అమెరికా దేశాన్ని, రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవకారుల్లో ఒకడు. ఆయన బహుకళా ప్రావీణ్యుడు, గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి. ఆయన కనిపెట్టిన వాటిలో "ఛత్వారపు కళ్ళద్దాలు", "ఓడొమీటర్ (ప్రయాణించిన దూరాన్ని సూచించేది)" మొదలగునవి చాలనే ఉన్నాయి. అగ్నిమాపక విభాగం, తపాలా సేవ, ఆసుపత్రి, లైబ్రరీ, అకాడమీ స్థాపనలో ఫ్రాంక్లిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఫ్రాంక్లిన్ "మొదటి అమెరికన్" అనే బిరుదుని కూడా పొందాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706 జనవరి 17 ఆదివారం మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. పిడుగులు పడి ఎన్నో విలువైన కట్టడాలు కూలిపోతూ ఉందడాన్ని చూసిన ఆయన, పిడుగుల బారి నుండి కట్టడాలను కాపాడటం కోసం "లైట్నింగ్ కండక్టర్" లను తొలిసారిగా 1752లో రూపొందించాడు. సముద్రం మీద కూడా ఎన్నో రకాల పరిశోధనలు చేసి సముద్రంలో చమురు వేస్తే దాని అలజడి తగ్గుతుందని కనుగొన్నాడు. ఆయన రూపొందించిన స్టౌవ్ లు, బై ఫోకల్ కంటి అద్దాలు ఇప్పటికీ వాడబడుతూ ఉన్నాయి. ఆమ్లీకృతంగా ఉన్న భూములలో సున్నం కలిపి తటస్థం చేయవచ్చుని సూచించాడు. గాలి, వెలుతురు లేని చోట్ల అంటువ్యాధులు త్వరగా ప్రబలుతాయని కూడా హెచ్చరించాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తండ్రి బెన్ బోధకుడిగా మారాలని కోరుకున్నాడు. ఎనిమిదేళ్ళ వయసులో అతన్ని వ్యాకరణ పాఠశాలకు పంపాడు. పది సంవత్సరాల వయస్సు వరకు కొత్త పాఠశాలలోనే ఉన్నాడు. తన పాఠశాల రోజుల నుండి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒక నావికుడు కావాలను



కున్నాడు. అతని తండ్రి అంగీకరించ లేదు. బెన్‌ను తన అన్నయ్య ప్రింటింగ్ షాపులో నేర్చుకోవడానికి పంపాడు. బెన్ ఫిలడెల్ఫియా, తర్వాత ఇంగ్లాండ్‌లో ఈ అభ్యాసాన్ని కొనసాగించాడు. చివరికి ఫిలడెల్ఫియాలో తన సొంత ముద్రణ వ్యాపారాన్ని స్థాపించాడు. రాజకీయాలతో సంబంధం పెట్టుకునే ముందు, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాలో ఒక ప్రింటింగ్ షాపును కలిగి, 1747 లో ప్రింటింగ్ నుండి రిటైర్ అయ్యాక, ఫిలడెల్ఫియా యొక్క పోస్ట్ మాస్టర్, బ్రిటిష్ నార్త్ అమెరికా కో-డిప్యూటీ పోస్ట్ మాస్టర్ గా కూడా పనిచేశాడు. 1775 లో, అతను యునైటెడ్ స్టేట్స్ యొక్క మొదటి పోస్ట్ మాస్టర్ జనరల్ అయ్యాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుదీర్ఘ ఆవిష్కరణల జాబితాలో బైఫోకల్స్, మెరుపు రాడ్, గ్లాస్ అర్మోనికా, ఒక లైబ్రరీ కుర్చీ, ఈత రెక్కలు, దీర్ఘకాల పరికరం, ఫ్రాంక్లిన్ స్టవ్, కాథెటర్ తదితరులు ఉన్నాయి.

1741 లో, బెన్ ఫ్రాంక్లిన్ స్టవ్ అనే ఇనుప కొలిమిని కనుగొన్నాడు. బెన్ వయసు పెరిగేకొద్దీ అతని దృష్టి క్షీణించింది. అతను చదవడానికి ఇష్టపడ్డాడు. రెండు జతల గ్లాసుల మధ్య మారడం అలసి పోయాడు. ఒకటి విషయాలు దగ్గరగా చూడటానికి అతనికి సహాయ పడింది, మరొకటి దూరంగా చూడటానికి. అందువల్ల అతను రెండు జతల నుండి కటకములను సగానికి కట్ చేసి, ఆపై ప్రతి లెన్స్‌లో సగం ఒకే చట్రంలో ఉంచి, బైఫోకాల్స్‌ను కనుగొన్నాడు. తన జీవిత కాలంలో, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనేక రచనలు చేశాడు. బాగా తెలిసిన వాటిలో పూర్ రిచర్డ్ యొక్క అల్మానాక్ , రిచర్డ్ సాండర్స్ అనే మారుపేరుతో రాసిన వార్షిక ప్రచురణ తదితరాలు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, పెన్సిల్వేనియా హాస్పిటల్ మరియు ఫ్రాంక్లిన్ మరియు మార్షల్ కాలేజీని స్థాపించారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన జీవిత కాలంలో అనేక అంతర్జాతీయ ప్రయాణాలు చేశాడు. 1776–84: ఫ్రాన్స్‌కు అమెరికన్ కమిషనర్‌గా పనిచేస్తూ, ఫ్రాన్స్‌తో కూటమి ఒప్పందంపై చర్చలు జరిపారు.


### ఫ్రాంక్లిన్ సుభాషితాలలో....

మరణానంతరం కూడా గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు వ్రాయి లేదా వ్రాయదగిన పనులు చెయ్యి. తృప్తి పేదవాడ్ని ధనవంతుడిగా చేస్తుంది. అసంతృప్తి గొప్పవాణ్ణి పేదవాడిగా మారుస్తుంది. కోపంతో మొదలుపెట్టిన పని తప్పనిసరిగా అవమానాల పాలౌతుంది. ఖాళీ సమయం కావాలనుకుంటే సమయాన్ని సరిగ్గా వినియోగించు కోవాలి. కారణం లేకుండా ఎవరికి కోపం రాదు. అయితే ఎప్పుడో గాని సరైన కారణం ఉండదు. సహనం కలవాడు ఏదైనా సాధించగలడు. మంచి యుద్ధం, చెడ్డ శాంతి అనేది ఎప్పుడూ ఉండదు... ఆయనకు జీవిత కాలంలో ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ లో అతను సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. అమెరికా స్వాతంత్ర్యం కోసం కృషి చేసి, 1766 జూలై 4న స్వాతంత్ర్య ప్రకటన చేస్తూ సంతకాలు చేసిన వారిలో ఫ్రాంక్లిన్ కూడా ఉన్నాడు. 1777 లో రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఇతను కూడా ఎంతగానో సహకరించాడు. శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా పరిణితి చెందిన ఆయన 1770 ఏప్రిల్ 17న మరణించాడు.

# హిమోఫిలియా పట్ల అవగాహన అవసరం

### నేడు ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం

వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫిలియా స్థాపకుడైన ఫ్రాంక్ ష్నాబెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 17వ తేదీని ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా జరుపుకుంటారు. రక్తస్రావం రుగ్మత గురించి అవగాహన పెంచడానికి మరియు విధాన రూపకర్తల దృష్టికి తీసుకురావడానికి, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17ని ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా జరుపుకుంటారు. హేమోఫిలియా 10వ శతాబ్దంలో కనుగొన బడింది. ప్రధానంగా మగవారిలో కనుగొనబడింది. అప్పుడు ఈ వ్యాధిని అబుల్కాసిస్ అని పిలిచేవారు. 1937 సంవత్సరంలో, హేమోఫిలియా జన్యుపరమైన రుగ్మత ఎా మరియు దీ అని రెండు రకాలుగా విభజించ బడింది, అయితే, అప్పటి వరకు సరైన చికిత్స కనుగొనబడలేదు. ఆ తర్వాత ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచి, ఈ తీవ్రమైన ఆరోగ్య సమస్యపై సరైన శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని వారికి తెలియజేయాలని నిర్ణయించారు. 1963లో, హీమోఫిలియాక్ రోగులందరికీ చికిత్స మరియు సంరక్షణను మెరుగు పరచడానికి వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హేమోఫిలియా (డబ్ల్యూఎఫ్‌హెచ్) స్థాపించ బడింది. హిమోఫిలియా అనేది అధిక రక్తస్రావంతో కూడిన రుగ్మత. రక్తం గడ్డకట్టే ప్రొటీన్లు లేకపోవడం వల్ల రోగి రక్తం సరిగ్గా గడ్డకట్టకుండా ఉండే అరుదైన రుగ్మత హిమోఫిలియా. హీమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తికి గాయం అయినప్పుడు, గడ్డకట్టే కారకాలు లేకపోవడం వల్ల అతనికి అధిక రక్తస్రావం జరుగుతుంది తీవ్రమైన హీమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తులు ఎటువంటి కారణం లేకుండా రక్తస్రావం కావచ్చు. రక్తం గడ్డకట్టే ప్రొటీన్లు లేకపోవడం వల్ల రోగి రక్తం సరిగ్గా గడ్డకట్టకుండా ఉండే




అరుదైన రుగ్మత హిమో ఫిలియా. హీమోఫిలియాతో బాధపడుతున్న వ్యక్తికి గాయం అయినప్పుడు, గడ్డకట్టే కారకాలు లేకపోవడం వల్ల అతనికి అధిక రక్తస్రావం జరుగుతుంది. వారు ఇతరులకన్నా వేగంగా రక్తస్రావం చేయరు, వారు ఎక్కువసేపు రక్తస్రావం చేస్తారు. హిమోఫిలియా మరియు ఇతర రక్తస్రావం రుగ్మతలు తగినంత గడ్డకట్టే కారకాలు లేనందున ఒక వ్యక్తి సాధారణం కంటే ఎక్కువ కాలం రక్తస్రావం అయ్యేలా చేస్తాయి. తీవ్రమైన పరిస్థితి ఉన్న కొందరు రోగులు కండరాలు, కీళ్ళు మరియు శరీరంలోని ఇతర భాగాలలో రక్తస్రావం కూడా అనుభవించవచ్చు. ఈ రుగ్మత యొక్క ఇతర లక్షణాలు దంత పని తర్వాత అధిక రక్తస్రావం, లోతైన లేదా పెద్ద గాయాలు, టీకా తర్వాత అసాధారణ రక్తస్రావం, మూత్రం లేదా మలంలో రక్తం, తెలిసిన కారణం లేదా వాపు, మరియు కీళ్లలో నొప్పి లేదా బిగుతు వంటివి కూడా ఉన్నాయి. తీవ్రమైన హీమోఫిలియా ఉన్నవారికి, తలపై చిన్న గడ్డ మెదడులో రక్తస్రావం కలిగిస్తుంది, ఇది తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. హిమోఫిలియా అనేది వారసత్వంగా వచ్చే రుగ్మత మరియు ఇది సాధారణంగా తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమిస్తుంది. తేలికపాటి హిమోఫిలియా సాధారణంగా యుక్తవయస్సు వరకు నిర్ధారణ చేయబడదు మరియు ఏదైనా శస్త్రచికిత్స ప్రక్రియలో గుర్తించబడవచ్చు. అందువల్ల, ముందస్తు రోగ నిర్ధారణ కోసం రుగ్మతపై అవగాహన పెంచడం అత్యవసరం. హిమోఫిలియా అనేది జన్యుపరమైన పరిస్థితి. రక్తం గడ్డకట్టే కారకాల తయారీకి సమాచారాన్ని అందించే జన్యువులోని మ్యుటేషన్ లేదా మార్పు కారణంగా ఇది సంభవిస్తుంది. ఈ జన్యువు ఞ క్రోమోజోమ్‌లో ఉన్నందున, మగవారిలో హిమోఫిలియా ఎక్కువగా ఉంటుంది. ఆడవారు వ్యాధి వాహకాలు మరియు అరుదుగా హిమోఫిలియా కలిగి ఉంటారు. ప్రస్తుతం అనేక ప్రజాసంఘాలు మరియు ప్రజలచే అవగాహన పెంచే ప్రచారాలు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు మొదలైనవి నిర్వహిస్తున్నారు. హీమోఫిలియా వ్యాధి గురించి సాధారణ ప్రజలకు తెలియజేయడానికి వివిధ రకాల కార్యకలాపాలు నిర్వహించ బడుతున్నాయి.

# మంగళకరమైన మాసం వైశాఖం

సంవత్సరంలో రెండవ మాసమైన వైశాఖానికి ప్రత్యేకత ఉంది. వైశాఖ మాస ప్రాతఃకాల స్నానాచరణకాక, ఈ మాసంలో ఎన్నో జయంతులు జరపడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది. వైశాఖ శుద్ధ తదియ బలరామ జయంతి, పంచమి శంకర భగవత్పాదుల జయంతి, షష్టి రామానుజా చార్యుల జయంతి, ద్వాదశి పరశురామ జయంతి, చతుర్దశి నరసింహ జయంతి, వైశాఖ పూర్ణిమ బుద్ధ జయంతి, శరభ జయంతి, కూర్మ జయంతి, వైశాఖ బహుళ విదియ నాడు నారద జయంతిలు జరుపు కోవడం జరుగుతున్నది. వైశాఖ శుద్ధ పాడ్యమి మొదలుకుని నెల రోజుల పాటు ప్రాత:కాల స్నానం, నెల రోజుల పాటు రావి చెట్టుకు నీరు పోసి ప్రదక్షిణలు ఆచరించడం పరిపాటి. శుక్ల పక్ష తృతీయ అక్ష తదియగా సుపరిచితమైనది. ఆరోజే సింహాచలపతికి చందనో త్సవం నిర్వహిస్తారు. విష్ణుపూజ, త్రిలోచన గౌరీ పూజలు తృతీయ నాడే చేయడాన్ని పురుషార్థ చింతా మణి వివరిస్తున్నది. అక్ష తృతీయ నాడే నూట తొంభై ఆరు వేల మానవ సంవత్సరాల త్రేతాయుగ ప్రారంభ దినమని అమాదేర్ జ్యోతిష గ్రంథం తెలుపు తున్నది. గంగానది జహ్నుముని చెవినుండి సప్తమి నాడు పుట్టినట్లు చతుర్వర్గ చింతామణి కథనం. శుద్ధ ఏకాదశి మోహిన్యేకాదశిగా, బహుళ ఏకాదశి ఆపర ఏకాదశి గా చెప్ప బడింది. బహుళ చతుర్దశి శివపూజ, సావిత్రీ వ్రతాచారణ గావిస్తారు. ఈ



మాసంలోనే నరసింహ నవరా త్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే అక్ష తృతీయ నాడు ఆంధ్ర కర్షకులు తాటి చెట్టును కేతనంపై నిలుపు కుని, ప్రధాన సాధనమైన నాగలిని ఆయుధంగా కలిగినన బలరాముని జయంతి రోజున తమ పొలాలలో, గృహస్థులు తమ ఇళ్ళలోని పెరళ్ళలో కూర పాదులు పాతడాన్ని ఆచరిస్తారు. అవి యథా కాలాన మెలకెత్తి, భరణి, కృతిక కార్తెలలో ఎండలను తట్టుకుంటూ నెమ్మదిగా ఎదుగుతూ ముంగిళ్ళు చల్ల బడడంతో ఏపుగా ఎదిగి ఆకర్షణీయంగా కాస్తాయి. కార్తీక మాఘమాసాల తర్వాత అంతటి మహత్యాన్ని కలిగి ఉన్న పుణ్యప్రద మాసం వైశాఖం. పూర్ణిమ తిథినాడు విశాఖ నక్షత్రం ఉండడం వల్ల ఈ మాసానికి వైశాఖ మాసం అనే పేరు ఏర్పడింది. ఆద్యాత్మికత, పవిత్రత, దైవశక్తి ఉన్న నెలల్లో వైశాఖ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వసంత ఋతువులో రెండవ మాసం వైశాఖ మాసం. 'మాధవ' మాసమని పిలువబడే వైశాఖ మాసం లక్ష్మీ నారాయణుల ఆరాధనకు చాలా ప్రసిద్ధమైనది. శ్రీ కృష్ణుడు అక్షయ తృతీయ ప్రాముఖ్యత గురించి ధర్మరాజుకు జ్ఞానోదయం చేసినట్లు పౌరాణికులు చెపుతారు. వైశాఖంలో రకరకాల వ్రతాలు ఆచరిస్తారు. వైశాఖ మాసంలో సూర్యుడు మేష సంక్రమణంలో ఉండగా ప్రాత: స్నానం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. వైశాఖ మాసం దాన ధర్మాలకు ఎంతో పుణ్య ప్రదమైన మాసంగా పురాణాలలో చెప్పబడింది. మహా విష్ణువు కు ప్రీతి కరమైన ఈ వైశాఖ మాసంలో తులసి దళాలతో శ్రీ మహావిష్ణువు ను లక్ష్మీ దేవితో కలిపి పూజించిన ముక్తి దాయకం. అలాగే శివునకు ఈ మాసమంతా అభిషేకం చేస్తే అది ఆధ్యాత్మిక ఆది భౌతిక ఆదిదైవిక ఇబ్బందులను తొలగించి మనశ్శాంతినిస్తుంది. ఈమాసంలో ఏక భుక్తం, నక్తం ఉత్తమంగా చెప్పబడింది. వైశాఖ మాసం అందరు దేవతలకు పూజనీయమైనది, యజ్ఞ యాగాదులకు, తపస్సులకు, పూజాదికాలకు, దాన ధర్మాలకు అత్యధిక ఫలమిచ్చి శాంతినిచ్చి కోరికలను తీరుస్తుంది. వైశాఖంలో ఉదకుంభ దానము...నీటితో కూడిన పాత్ర లేదా కుండ దానం చేయడం, దాహం తీర్చగల చలివేంద్రములు ఏర్పాటు చేసి మంచినీరు అందించడం పుణ్యప్రదం.